RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 237 ఆదివారం 21 సెప్టెంబర్ 2025 పేజీలు : 4 వెల : రూ. 2.00


## రైల్వేలో 6,374 పోస్టుల భర్తీకి చర్యలు

న్యూఢిల్లీ : రైల్వేలో ఖాళీగా ఉన్న 6,374 టెక్నీషియన్ పోస్టుల భర్తీకి చర్యలు ప్రారంభమయ్యాయి. సిగ్నల్, టెలికమ్యూనికేషన్ సహా 51 కేటగిరీల్లోని గ్రేడ్ –సి పోస్టులు భర్తీ కానున్నాయి. దేశంలోని 17 జోన్లు, ఉత్పాదక యూనిట్లలో ఈ పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. ప్రస్తుతం పేర్కొన్న పోస్టుల సంఖ్య కన్నా ఇంకా ఎక్కువ ఖాళీలు ఉన్నాయని అధికారవర్గాలు తెలిపాయి. సిగ్నల్, టెలికాం విభాగంలో చివరిసారిగా 2017లో పోస్టుల భర్తీ జరిగింది.

# పొలిటికల్ థ్రిల్లర్‌గా...

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక...

## ఎవరి స్ట్రాటజీ ఎలా ఉందంటే...




హైదరాబాద్ : తెలంగాణలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. జూబ్లీహిల్స్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న బీఆర్ఎస్ నేత మాగంటి గోపినాథ్ మరణంతో అక్కడ ఉపఎన్నిక అనివార్యమైన సంగతి తెలిసిందే. మాగంటి గోపినాథ్ జూన్ 8వ తేదీన మరణించగా... నిబంధనల ప్రకారం అక్కడ డిసెంబర్ మొదటి వారంలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే బీహార్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోకవర్గ ఉప ఎన్నికకు కూడా కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటిస్తుందని భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రధాన రాజకీయ పార్టీలు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో పోటీపై ప్రణాళికలు రచిస్తున్నాయి. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పొలిటికల్ థ్రిల్లర్‌ను తలపిస్తుందా? లేదా? అనేది ఇప్పుడు తెలుసుకుందాం...

**రంగంలోకి కేటీఆర్....** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో విజయం సాధించి... సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకోవాలని బీఆర్ఎస్ అధిష్టానం భావిస్తుంది. అయితే బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరనే ఉత్కంఠ కొనసాగుతుంది. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య మాగంటి సునీతను బీఆర్ఎస్ బరిలో నిలుపుతుందా? లేదా మరొకరికి అవకాశం ఇస్తుందా? అనేది చూడాల్సి ఉంది. అయితే ఇప్పటికే నియోజకవర్గంలో మాగంటి గోపినాథ్ కూతుళ్లు... ఇంటింటికి తిరుగుతూ ప్రజలను కలుస్తున్నారు. పార్టీ ఆదేశాలతోనే సునీత తరఫున ఆమె కూతుళ్ల విస్తృతంగా ప్రచారం చేస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. మరోవైపు పార్టీ అభ్యర్థి ఎవరనేది ఇప్పటివరకు బీఆర్ఎష్ ప్రకటించినప్పటికీ... కేటీఆర్ మాత్రం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. నియోజకవర్గానికి చెందిన పార్టీ నేతలతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేస్తున్నారు.

**కాంగ్రెస్ ఫోకస్...** మరోవైపు కాంగ్రెస్ కూడా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై ఫోకస్ చేస్తుంది. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌లు ఇప్పటికే పార్టీ నాయకులకు ఇందుకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదివారం రోజున నియోజకవర్గ పరిధిలోని డివిజన్ల ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనే విషయం పార్టీ అధిష్టానం చూసుకుంటుందని చెప్పారు. అయితే పార్టీ గెలుపుకోసం పనిచేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పోలింగ్ బూత్ ల వారీగా ప్రచార ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. నియోజకవర్గంలో సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న భరోసా కల్పించాలని తెలిపారు. కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, అంజన్ కుమార్ యాదవ్, తదితరులు రేసులో ఉన్నట్టుగా వార్తలు వస్తున్నాయి. ఇదిలాఉంటే, బీజేపీ మాత్రం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు సంబంధించి పెద్దగా దృష్టి సారించినట్టుగా కనిపించడం లేదు. అయితే బీజేపీ కూడా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు త్వరలోనే అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే ఈ ఉప ఎన్నిక మూడు ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారనుంది. జూబ్లీహిల్స్ సిట్టింగ్ స్థానం కావడంతో... ఆ స్థానాన్ని నిలుపుకోవడం బీఆర్ఎస్‌కు అత్యంత అవశ్యకమనే చెప్పాలి. ఇప్పటికే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, సికింద్రాబాద్ కంటోన్మెట్ ఉప ఎన్నికలో సిట్టింగ్ స్థానాన్ని చేజార్చుకోవడం, లోక్‌సభ ఎన్నికల్లో ఖాతా తెరవకపోవడం బీఆర్ఎస్‌కు ఇబ్బందికరంగా మారిన సంగతి తెలిసిందే. మరోవైపు ఇటీవల కవిత వ్యవహారం కూడా తీవ్ర దుమారం రేపింది. ఈ క్రమంలోనే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచి సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవడం గులాబీ పార్టీకి చాలా అవవసరం. ఇక, తెలంగాణ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా తమ పాలనపై ప్రజల్లో సానుకూలత ఉందని నిరూపించుకోవడానికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలిచి తీరాలను పట్టుదలతో ఉంది. తద్వారా రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలపై పాజిటివ్ వైబ్ క్రియేట్ చేయవచ్చని భావిస్తుంది. ఎందుకంటే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఖాతా తెరవలేదనే సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే గ్రేటర్‌లో పట్టు సాధించేందుకు ఆ పార్టీ ప్రయత్నాలు చేస్తుంది. ఇదిలాఉంటే, బీజేపీ కూడా తెలంగాణలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 8 సీట్లు సాధించడం ఆ పార్టీకి కొత్త జోష్ తెచ్చింది. ఈ ఊపును కొనసాగించ డం ఆ పార్టీ ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది. ఇటీవలే రాష్ట్రంలో బీజేపీ బాధ్యతలు చేపట్టిన ఎన్ రామచందర్‌రావుకు కూడా ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయం అత్యంత కీలకం అయ్యే అవకాశం ఉంది. మరి బీజేపీ ఎలా వ్యవహరిస్తుందనేది వేచి చూడాల్సి ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక థ్రిల్లర్‌ను తలపించే అవకాశాలు కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.




ప్రధాని నరేంద్ర మోదీ శనివారం గుజరాత్‌లో పర్యటించారు. ఈసందర్భంగా అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. మనకు ప్రధాన శత్రువులు ఎవరూ లేరని, కానీ.. విదేశాలపై ఆధారపడటమే మన ప్రధాన శత్రువు అని వ్యాఖ్యానించారు. హెచ్–1బీ వీసాల దరఖాస్తు రుసుమును అమెరికా లక్ష డాలర్లకు పెంచుతున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'నేడు భారత్ "విశ్వబంధు" స్ఫూర్తితో ముందుకుసాగుతోంది. ప్రపంచంలో మనకు ప్రధాన శత్రువులు ఎవరూ లేరు. మన అతిపెద్ద శత్రువు ఇతరదేశాలపై ఆధారపడటమే. దీన్ని మనం ఓడించాలి. విదేశాలపై ఎక్కువగా ఆధారపడితే.. దేశ అభివృద్ధి విఫలమవుతుంది. ప్రపంచ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం అత్యధిక జనాభా కలిగిన దేశం ఆత్మనిర్భర్‌గా మారాలి. ఇతరులపై ఆధారపడితే మన ఆత్మగౌరవం దెబ్బతింటుంది. భారతదేశ అభివృద్ధిని, భావి తరాలను పణంగా పెట్టలేం' అని మోదీ పేర్కొన్నారు. ఈసందర్భంగా దేశం భరించాల్సిన నష్టాల్లో షిప్పింగ్ రంగం ఒకటని మోదీ పేర్కొన్నారు. 50 ఏళ్ల క్రితం మన దేశంలో తయారుచేసిన నౌకలనే మనం ఉపయోగించుకొనేవాళ్లమన్నారు. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ రంగం పూర్తిగా నాశనమైందని ఆరోపించారు. వారి ప్రభుత్వ హయాంలో స్వదేశంలో నౌకల తయారీపై దృష్టిపెట్టకుండా విదేశీ నౌకలకు అద్దెలు చెల్లించేందుకే ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. అందువల్లే ఇప్పటికీ మన వాణిజ్యంలో 90 శాతం విదేశీ నౌకల పైనే ఆధారపడుతున్నామన్నారు. ఇందుకుగాను మనం ఏటా రూ. 6 లక్షల కోట్లు చెల్లిస్తున్నామని వెల్లడించారు. ఇది దేశ రక్షణ బడ్జెట్ కంటే ఎక్కువన్నారు. దీనికి ముందు భావ్‌నగర్‌లో రూ. 34,200 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను మోదీ ప్రారంభించారు.


## తెలంగాణలో బతుకమ్మ సంబరాలు.. షెడ్యూల్ ఇలా..




హైదరాబాద్: బతుకమ్మ పండగను పెద్దఎత్తున నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో ఈమేరకు ఏర్పాట్లు చేస్తోంది. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈనెల 21న హైదరాబాద్ శివారులో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం హనుమకొండలోని చారిత్రక వేయి స్తంభాల ఆలయం ప్రాంగణంలో రాష్ట్రస్థాయి వేడుకలకు శ్రీకారం చుట్టనున్నారు. ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పరిశీలించారు. 22న హైదరాబాద్‌లోని శిల్పరామం, మహబూబ్‌నగర్‌లోని పిల్లలమర్రి వద్ద సంబరాలు నిర్వహించనున్నారు. 23న నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం, 24న భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వర ముక్తేశ్వర ఆలయం, కరీంనగర్ సిటీ సెంటర్‌లో వేడుకలు ఉంటాయి. 25న భద్రాచలం, అలంపూర్ జోగులాంబ ఆలయాల్లో పండగ చేయనున్నారు. 26న నిజామాబాద్‌లోని అలీసాగర్, మెదక్, ఆదిలాబాద్‌లలో సంబరాలు నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో సైకిల్ ర్యాలీ ఉంటుంది. 27న ఉదయం నెక్లెస్ రోడ్‌లో మహిళల బైక్ ర్యాలీ, సాయంత్రం ఐటీ కారిడార్‌లో బతుకమ్మ కార్నివాల్ ఉంటాయి. 28న నగరంలోని ఎల్బీ స్టేడియంలో 50 అడుగుల బతుకమ్మ, 10 వేల మందికిపైగా మహిళలతో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ లక్ష్యంగా భారీ వేడుకలు నిర్వహించనున్నారు. 29న పీపుల్స్ ప్లాజాలో ఉత్తమ బతుకమ్మ పోటీలు, స్వయం సహాయక సంఘాలతో కార్యక్రమాలు చేపట్టనున్నారు. రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్, హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్, రంగారెడ్డి ప్రాంతంలో బతుకమ్మ వేడుకలు ఉంటాయి. 30న ట్యాంక్‌బండ్‌పై గ్రాండ్ ఫ్లోరల్ పరేడ్, వింటేజ్ కార్ల ర్యాలీ, బతుకమ్మ లైటింగ్ ప్రదర్శన, జపనీయుల ప్రదర్శన, సెక్రటేరియట్‌పై 3డీ మ్యాప్ లేజర్ షో నిర్వ హించనున్నారు. ఈ నెల 25 నుంచి 29 వరకు హైదరాబాద్ స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో బతుకమ్మ ఆర్ట్ క్యాంప్ ఉంటుంది.

# ట్రంప్‌కు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాల్సిందే!

## లక్ష డాలర్ల వీసా ఫీజు వేసే ట్రంప్‌కు భారతీయుడు షాక్ ఇవ్వగలడా?




అక్కడెక్కడో అమెరికాలోని వైట్ హౌస్ లో కూర్చొని.. ప్రపంచ దేశాల తలరాతల్ని ఇష్టారాజ్యంగా రాస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కు సరైన రీతిలో బుద్ధి చెప్పే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు.. ఏంది నీ మాటలు.. ఏంది నీ కత అని ఇట్టే విరుచుకుపడేటోళ్లు బోలెడంత మంది కనిపిస్తారు. ట్రంప్ తీరును జాగ్రత్తగా గమనిస్తే.. మన దేశంలోని పెత్తాందార్లు.. తెలుగు రాష్ట్రాల్లో దొరలు.. భూస్వాములు.. ఇలా చెప్పుకునేటోళ్లలో కనిపించే లక్షణాలు కనిపిస్తాయి. అగ్రరజ్యాధినేతగా అన్ని అంశాల్ని పరిగణలోకి తీసుకోవాల్సిన పెద్ద మనిషి.. తన దేశం మాత్రమే మొదటి స్థానంలో ఉండాలని ఆశించటం వరకు తప్పేం కాదు. ఆ పేరుతో ప్రపంచ దేశాలకు అదే పనిగా షాకులు ఇస్తున్న వైనాన్ని మాత్రం ఎందుకు ఒప్పుకోవాలన్నది ప్రశ్న. మరి.. ముఖ్యంగా భారత్ మీద అదే పనిగా విరుచుకుపడుతున్న అతగాడికి సరైన రీతిలో బుద్ధి చెప్పే అవకాశం భారత ప్రభుత్వం కంటే కూడా భారత ప్రజల మీదనే ఉందని చెప్పాలి. దీని కోసం పెద్ద పెద్ద నినాదాలు చేయాల్సిన అవసరం లేదు. నిరసనలు చేపట్టాల్సిన పని లేదు. నిద్ర లేచింది మొదలు పడుకునే వరకు కొనుగోలు చేసే వస్తుల్ని.. ఒక్క క్షణం.. ఇది అమెరికన్ కంపెనీదా? కాదా? అన్నది ఒక్కసారి చెక్ చేసుకుంటే.. కొనుగోలు చేసే వస్తువులు.. వస్తు సేవలకు సంబంధించి అమెరికా సంస్థకు చెందింది కాకుండా.. దాని ప్రత్యామ్నాయ కంపెనీల ఉత్పత్తుల్ని కొనుగోలు చేయటం ద్వారా..




దారికి తేవచ్చు. ఇప్పుడున్న డిజిటల్ ప్రపంచంలో ఏది అసాధ్యం కాదు. అన్ని విషయాలు అంకెలు మాత్రమే మాట్లాడతాయి. వ్యాపారాలు.. వ్యాపార ప్రయోజనాలకు నొప్పి కలిగేలా చేస్తే.. పాలకులు సైతం చచ్చినట్లుగా దారికి రాక మానదు. అందునా అగ్రరాజ్యం అమెరికాలో ఇండస్ట్రీ లాబీ చాలా పవర్ ఫుల్. వారు తమ ప్రయోజనాలకు భంగం కలిగితే.. అదే ప్రభుత్వమైనా అస్సలు ఒప్పుకోరు. ఇలాంటి వేళ.. ట్రంప్ తో డైరెక్టుగా మాట్లాడే కన్నా.. భారతీయులు ఐకమత్యంగా అమెరికన్ ఉత్పత్తుల వినియోగంపై ఒక నిర్ణయాన్ని తీసుకుంటే సరి. అక్కడెక్కడో ఉన్న ట్రంప్.. మన జీవితాల్ని దెబ్బ తీసేలా సుంకాల షాక్ ఇవ్వగలడు. వ్యక్తిగా అతగాడు తీసుకున్న నిర్ణయాన్ని.. భారతీయులంతా ఉమ్మడి ఒక మాట అనుకున్నట్లుగా అమెరికన్ ఉత్పత్తులు.. అమెరికన్ వస్తుసేవల వినియోగం మీద అప్రకటిత బ్యాన్ ఎవరికి వారు విధించుకుంటే.. మూడు నెలల్లో దాని తీవ్రత అన్ని కంపెనీలకు అర్థమవుతుంది. ఆ తర్వాత ఏం జరగాలో అది జరిగిపోతుంది. కాకుంటే.. భారతీయులంతా ఒకే మాట మీద ఉన్నట్లుగా అమెరికన్ కంపెనీల వస్తుసేవల్ని కొనుగోలు చేసే వేళలో తగిన జాగ్రత్తలు తీసుకొని..వాటికి దూరంగా ఉంటే సరి. పిచ్చి పట్టినట్లుగా కొనుగోలు చేసే ఆపిల్ ఫోన్.. మైక్రోసాఫ్ట్.. గూగుల్.. అమెజాన్..నెట్ ఫ్లిక్స్..ఇంటెల్ చిప్ లు ప్రాసెసర్లు లాంటివి అమెరికాకు చెందినవే. ఇక్కడ మీరు అడగొచ్చు. మైక్రోసాఫ్ట్ లేకుండా సాధ్యమా? అని. నిజమే.. అన్నింటిని ఒకే గాటున కట్టేయలేం. అందుకే మైక్రోసాఫ్ట్ కు మినహాయింపు ఇవ్వొచ్చు. ఆపిల్ ఫోన్ కొనకపోతే ప్రాణం పోతుందా? అమెజాన్ లోనే ఆర్డర్ ఇవ్వాల్సిన అవసరం లేదు కదా? ఫ్లిప్ కార్డులో ఇవ్వొచ్చు కదా? మరో ఉదాహరణగా చెప్పాలంటే ఓలా.. ఊబర్ లనే తీసుకుంటే.. ఊబర్ అమెరికన్ కంపెనీ. దానికి బదులుగా ఓలా ప్రత్యామ్నాయం ఉన్నప్పుడు దాన్ని వినియోగిస్తే సరిపోతుంది. ఇక్కడ చెప్పేదేమంటే.. అమెరికాను వ్యతిరేకించటం.. అమెరికన్ వస్తువుల్ని వాడకూడదన్నది పంతమేం కాదు. ఎడా పెడా ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకునే ట్రంప్ కు షాకివ్వటమే ఇక్కడ ముఖ్య ఉద్దేశమన్నది మర్చిపోకూడదు. అందుకే.. అవకాశం ఉన్న వస్తువుల్ని.. వస్తుసేవల్ని వినియోగించే విషయంలో అమెరికా ఉత్పత్తులకు కాస్త దూరంగా.. . కొంతకాలం ఉండగలిగితే.. సగటు భారతీయుడి శక్తి వైట్ హౌస్ కు తెలిసే వీలుంది. సుంకాలు.. ఎడాపెడా నిర్ణయాలతో భారతీయు జీవితాల్ని అదే పనిగా కెలికేసే ట్రంప్ కు.. సగటు భారతీయుడు రిటర్న్ గిఫ్టు ఇచ్చే అవకాశం లేదా? అంటే.. ఎందుకు లేదనే సమాధానం టక్కున వస్తుంది.

# సంపాదకీయం

## పాక్-సౌదీ రక్షణ ఒప్పందం..! సైన్యాన్ని అమ్మేసిందా...? కథ పెద్దదే

ప్రపంచంలో మరీ ముఖ్యంగా పశ్చిమాసియాలో ఓ అంశం చాలా చర్చనీయం అవుతోంది... అదే దక్షిణాసియాలోని పాకిస్థాన్ తో పశ్చిమాసియాలోని సౌదీ అరేబియా తో రక్షణ ఒప్పందం చేసుకోవడం.. ఈ ఒప్పందం ప్రకారం ఈ రెండు దేశాలలోని ఏ దేశంపై దాడి చేసినా అది రెండు దేశాల పైన జరిగినట్లుగానే భావిస్తారు. పెహల్గాం ఉగ్రదాడి- ఆ తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాక్-సౌదీ రక్షణ ఒప్పందం కీలకంగా మారింది. ఇక ఇందులో మూడో దేశం కూడా చేరే చాన్సుందని అంటున్నారు. అంతేకాదు.. ఈ ఒప్పందం కింద అణ్వాయుధాలు వాడకూదన్న రూల్ కూడా ఏమీ లేదని పాకిస్థాన్ అంటోంది. కానీ, సౌదీతో పాక్ కొత్త పొత్తు వెనుక అసలు విషయం వేరే ఉంది.

**ఏకైక అణు సామర్థ్యం..** ముస్లిం దేశాల్లో అణు బాంబులు ఉన్నది పాకిస్థాన్ మాత్రమే. ఇరాన్ కూడా అణ్వాయుధాలు సమకూర్చుకుందని చెబుతారు కానీ.. అందులో కచ్చితత్వం లేదు. అసలు ఇరాన్ అణు సామర్థ్యాన్ని ఇటీవల ఇజ్రాయెల్ దెబ్బకొట్టింది కూడా. ఈ నేపథ్యంలో పాక్ తాజాగా సౌదీతో చేసుకున్న ఒప్పందంపై చర్చ సాగుతోంది. దీనిని నాటో తరహా ఒప్పందం అని పాక్ అంటోంది. నాటో సభ్య దేశాల్లో ఏ ఒక్క దానిపై బయటి దేశం దాడి చేసినా అది నాటో మొత్తం దేశాలపై చేసినట్లుగానే భావించి యుద్ధం చేస్తారు. ఇప్పుడు సౌదీ అరేబియా తోనూ పాక్ ఇలాంటి ఒప్పందమే చేసుకుంది.

**పశ్చిమాసియాలో పెత్తనానికి...** విస్తీర్ణం ప్రకారం సౌదీ అరేబియా పశ్చిమాసియాలో పెద్ద దేశం. కానీ, ఈ ప్రాంతంలో ఏకైక అణు ఆయుధాలు ఉన్నది ఇజ్రాయెల్. అందుకే దాని శత్రుదేశాలన్నీ భయపడుతుంటాయి. ఆఖరికి హమాస్ మిలిటెంట్ నేతలు లక్ష్యంగా ఖతర్ పై ఇజ్రాయెల్ దాడి చేసినా ఏమీ అనలేని పరిస్థితి. సౌదీ అరేబియా ఇప్పుడు పాకిస్థాన్ తో చేతులు కలిపినందున దానికీ అణు భద్రత లభించినట్లేనని (పరోక్షంగా అయినా) భావించాలి. దీంతో ఇజ్రాయెల్ తమతో జాగ్రత్తగా ఉంటుందని భావిస్తోందనుకోవచ్చు.

**పాక్ సైన్యాన్ని అమ్మేసినట్లే...** పైకి మాత్రం సౌదీతో రక్షణ ఒప్పందం చేసుకున్నా.. పాకిస్థాన్ అసలు ఉద్దేశం మాత్రం ఆ దేశం నుంచి ఆర్థిక సాయం పొందడం. పరోక్షంగా ఒక్క మాటలో చెప్పాలంటే, సౌదీని రక్షణ పరంగా ఆదుకుంటామనే లెక్క చూపి తమ సైన్యాన్ని ఆ దేశానికి అమ్మేసినట్లు. ఇక పాక్ కు ఎప్పటినుంచో సౌదీ ఉచితంగా కూడా ఆర్థిక సాయం చేస్తోంది. ఇకపై రక్షణ ఒప్పందం సాకు చూపి మరింత డబ్బులు పొందవచ్చు.

**భారత్ కు మేల్కొలుపు...** పాక్-సౌదీ ఒప్పందం భారత్ కు పారాహుషార్ అనే చెప్పాలి. ఎందుకంటే.. సౌదీ నుంచి వచ్చే డబ్బును పాక్ మళ్లీ టెర్రరిస్టులను ప్రోత్సహించడానికి వాడుతుంది. వారిని భారత్ పైకి ఎగదోస్తుంది. అందుకని మన దేశం ఈ పరిణామాలపై ఓ లుక్ ఎప్పటికీ ఉంచాలి.



## పాఠశాలలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

శామీర్ పేట, సెప్టెంబర్ 20 ( గరుడ వార్త) : పాఠశాలలో విద్యార్థులు ఘనంగా బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. శనివారం ఉమ్మడి శామీర్ పేట మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు. పాఠశాలలకు దసరా సెలవులు రావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు బతుకమ్మలను ఏర్పాటు చేసుకొని పాటలు పాడుతూ ఆటలు ఆడారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలంగాణ పూల పండగ అయినా బతుకమ్మ గురించి తెలియపరచి, గౌరమ్మని పూజించి, కోలాటాలతో సందడిగా బతుకమ్మ ఆటలు ఆడారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా బతుకమ్మ పాటలకు స్టెప్పులు వేస్తూ డాన్సులు చేశారు.



## రక్తదానం ప్రాణదానంతో సమానం : ఎంపీ ఈటెల



శామీర్ పేట, సెప్టెంబర్ 20( గరుడ వార్త) : ఒకరి రక్తదానంతో మరొకరికి ప్రాణదానం లభిస్తుందని ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. శనివారం బిజెపి ఆధ్వర్యంలో సేవా పక్షంలో భాగంగా శామీర్ పేట మండలం అలియాబాద్ లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీ ఈటెల మాట్లాడుతూ యువకులు ముందుకు వచ్చి రక్తదానం చేస్తే ప్రమాదాల్లో గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎంతోమందిని కాపాడవచ్చు అన్నారు. రక్తాన్ని ఇచ్చిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ రూరల్ జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు విక్రం రెడ్డి, శామీర్ పేట మండల మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, బిజెపి మండల అధ్యక్షుడు కృష్ణ, బిజెపి నాయకులు గిరి, సాయి గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అధ్వానంగా అంతర్గత రోడ్లు



సిరిసిల్ల : ఈ చిత్రంలో కనిపిస్తున్న రోడ్డు సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేట జ్యోతినగర్‌లోనిది. చిన్నపాటి వర్షానికే రోడ్డు గుంతలుగా మారుతుండగా కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. బురద కారణంగా అదుపు తప్పి కింద పడుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనమై ఏళ్లు గడిచినా సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో వర్షాకాలం వచ్చిందంటే అవస్థలు పడుతున్నట్లు చెబుతున్నారు. ఇది సిరిసిల్ల నుంచి పెద్దబోనాల వెళ్లే రోడ్డు. ఈ దారిగుండా నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. చిన్నపాటి వర్షానికే రోడ్డు అధ్వానంగా మారుతుంది. గుంతలు పడిన చోట మరమ్మతులు చేపట్టకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఏటా వర్షకాలంలో ఇబ్బందులు తప్పడం లేదని వాహనదారులు వాపోతున్నారు.సిరిసిల్ల మున్సిపాల్టీలో చిన్నపాటి వర్షానికే రోడ్లు ఛిద్రం అవుతున్నాయి. జిల్లా కేంద్రంగా ఏర్పడి ఏళు గడుస్తున్నా పూర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రధాన, లింకు, విలీన గ్రామాల్లోని రోడ్లు అధ్వానంగా మారుతున్నాయి. దశాబ్దాల క్రితం వేసిన రోడ్లు కావడం, మరమ్మతులకు నోచుకోకపోవడంతో పూర్తిగా దెబ్బతింటున్నాయి. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికావడమే కాకుండా, రోడ్లు సైతం దెబ్బతింటున్నాయి. విలీన గ్రామాల పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారింది. చంద్రంపేట, జ్యోతినగర్, ఇప్పల్లపలి, పెద్దూరు తదితర గ్రామాల్లో ఇప్పటికీ చాలాచోట్ల మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. పూర్తి స్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టకపోవడంతో ఆయా గ్రామ ప్రజలు అవస్థలు పడుతున్నారు. బురద రోడ్ల మీదనే ప్రయాణాలు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. ఫస్ట్ గ్రేడ్ మున్సిపాలిటీలో కనిస మౌలిక వసుతులు కల్పించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**బురదతో అవస్థలు**

చిన్న పాటి వర్షానికే రోడ్లు చిత్తడిగా మారుతున్నాయి. బురద రోడ్డుపై వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. సీసీ రోడ్ల నిర్మాణం చేపడతామని అంటున్నారే తప్ప ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. అధికారులు సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

– శ్రీకాంత్ చంద్రంపేట

సీసీ నిర్మాణం చేపట్టాలిపట్టణంతో పాటు, శివారు ప్రాంతాల్లో సీసీ రోడ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో శివారు ప్రాంతాల్లో ఉన్న మట్టి రోడ్లపై వాహనదారులు అదుపు తప్పి కింద పడుతున్నారు. బురద రోడ్లపై ప్రయాణం చేయడం కష్టంగా మారుతోంది. అధికారులు స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి.

– రాజు, 12వ వార్డు

సిరిసిల్ల పట్టణ స్వరూపం

వార్డులు : 39
పట్టణ జనాభా : 1,16,938
పట్టణంలో రోడ్లు : 276.91 కి.మీ
బీటీ రోడ్లు : 40.33 కి.మీ
సీసీ రోడ్లు : 137.44 కి.మీ

## నిధులు రాలే.. వసతులు మెరుగవలే!

పెద్దపల్లి : ఉత్తమ వైద్యసేవలు అందిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్స్(ఎన్‌క్వాస్) ప్రోత్సాహక నిధులు అందని ద్రాక్షలా మారాయి. జాతీయస్థాయి నిర్దేశిత ప్రమాణాలు పాటించిన ఆసుపత్రులకు నిధుల మంజూరులో నిరీక్షణ తప్పడం లేదు. రెండేళ్లుగా నిధుల కేటాయింపు కాగితాలకే పరిమితమైంది. ఫలితంగా ఆసుపత్రుల్లో వసతులు మెరుగుపడటం లేదు.

ప్రక్రియ ఇలాప్రైవేటుకు దీటుగా వైద్య సేవలు అందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులకు కేంద్రం చేయూతనిస్తోంది. ఓపీ, అడ్మిన్, రేడియాలజీ, ఎమర్జెన్సీ, ఆక్సిలరీ, ఐపీడీ, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, ప్రసూతి వార్డు విభాగాల్లో సేవలు, రికార్డులు, పరిసరాలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తుంది. సేవలకు పాయింట్లు కేటాయించి అత్యధిక స్కోరు సాధించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఏటా రూ.3 లక్షలు, ఉప వైద్య కేంద్రాలకు రూ.1.50 లక్షలు, వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులకు ఒక్కో బెడ్‌కు రూ.10 వేల చొప్పున మూడేళ్ల పాటు నిధులు మంజూరు చేస్తారు. ఏటా 25 శాతం అటెండర్ స్థాయి నుంచి వైద్యుల వరకు పొందుతారు. 75 శాతం కుర్చీలు, బెంచీలు, వైద్య పరికరాలు, తాగునీరు, ఇతర మౌలిక వసతులకు. వైద్య సేవల్లో ఇబ్బంది లేకుండా రోగులకు అవసరమైన ఇతర వనరులు సమకూర్చుతారు.

**ఎంపికైనా ..**

కాల్వశ్రీరాంపూర్ పీహెచ్‌సీ ఎన్‌క్వాస్‌కు ఎంపికైనా వసతులు మెరుగవక ప్రసవాలు జరగడం లేదు.

కోరుట్ల, ఎకీన్‌పూర్, ఎస్కోనిగుట్ట పీహెచ్‌సీలలో ప్రాథమిక వైద్యమే అందుతోంది. వీణవంకలో రోగులకు సరిపడా సదుపాయాలు లేవు. ప్రమాదాల బారిన పడి వెళ్లిన రోగులకు ప్రథమ చికిత్సతో సరిపెడుతున్నారు. సరైన కుర్చీలు, బెంచీలు లేక నిలబడే పరిస్థితి నెలకొంది. వైద్య విధాన పరిషత్తు ఆసుపత్రుల్లో రోగుల సంఖ్యకు సరిపడా వసతులు లేవు.

నిధులు రాకున్నా పీహెచ్‌సీల్లో వైద్య సేవలకు ఇబ్బంది లేదని, సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నామని పెద్దపల్లి జిల్లా వైద్యాధికారి ప్రసన్నకుమారి చెప్పారు. ప్రోత్సాహక నిధులు విడుదలైతే వసతులు మరింత మెరుగుపడనున్నాయని వివరించారు.

రెండేళ్లలో ఎంపికైన ఆసుపత్రులు

పెద్దపల్లి : 8
జగిత్యాల : 9
కరీంనగర్ : 4
రాజన్న సిరిసిల్ల : 9


## బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం డి జాంగిర్ పితృవియోగం...



శామీర్ పేట, సెప్టెంబర్ 20( గరుడ వార్త ) : బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం డి జాంగిర్ తండ్రి ఖాసీం ఆకస్మికంగా శనివారం మృతి చెందారు. దీంతో విషయం తెలిసిన మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి శామీర్ పేట మండలం తుర్కపల్లి గ్రామం లోని స్వగృహంలో ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు చేసి రిమాండ్ కు తరలించిన షామీర్పేట పోలీసులు...

శామీర్ పేట, సెప్టెంబర్ 20( గరుడ వార్త) : గంజాయి విక్రయిస్తున్న ఇద్దరినీ అదుపులో తీసుకొని రిమాండ్ కు తరలించిన సంఘటన శనివారం శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం రాత్రి మజీద్ పూర్ గ్రామ పరిధిలోని ఐసర్ పెట్రోల్ బంక్ ముందర ఇద్దరు వ్యక్తులు గంజాయి అమ్మతున్నారని పక్క సమాచారంతో శామీర్ పేట పోలీసులు దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించగా మేడ్చల్ కు చెందిన పిల్లలమర్రి సంజీవ, సయ్యద్ షా ఖాద్రిలు గా గుర్తించారు. వారి వద్ద నుంచి 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.




తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు రంగం సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 2 వరకు తొమ్మిది రోజుల పాటు వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కమనీయ వేడుకల కోసం లక్షలాదిగా తరలివచ్చే భక్తుల కోసం టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. బ్రహ్మోత్సవాల్లో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామని టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ చెప్పారు.

## వ్యూహం రచిద్దాం.. పాగా వేద్దాం

సంగారెడ్డి: రానున్న మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించిన నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎన్నికలకు సమాయత్తమవుతున్నాయి. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలైన అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భారాస, భాజపాలు వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు రిజర్వేషన్లు అనుకూలిస్తే సిద్ధంగా ఉండేందుకు కసరత్తు చేసుకుంటున్నారు.

**హామీలు అమలు చేయడం లేదని భారాస**

ప్రతిపక్ష భారాస ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో బలమైన క్యాడర్‌ను కలిగి ఉంది. మాజీ మంత్రి హరీశ్‌రావు నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలపై నిరసన కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా జిన్నారంలో పటాన్‌చెరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల కర్షకులకు రైతుభరోసా కోసం మహాధర్నా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలు సక్రమంగా అమలు చేయడం లేదంటూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేస్తున్నారు.

**మెజార్టీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్**

రానున్న స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవడానికి



అధికార కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇప్పటికే నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై నేతలు, పార్టీ కార్యకర్తల నుంచి అంతర్గతంగా సమాచారాన్ని సేకరిస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలతో పాటు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలున్న చోట మండలాల వారీగా పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నారు. ఇటీవలే ఉమ్మడి జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులైన వివేక్ వెంకటస్వామి ఉమ్మడి జిల్లాలోని పదకొండు నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై నిఘా వర్గాల ద్వారా సమగ్ర సమాచారం తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ బలహీనంగా ఉన్న నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని నిర్ణయించారు.

**పట్టున్న ప్రాంతాలపై భాజపా దృష్టి**

గ్రామీణ ప్రాంతాల్లో పట్టున్న ప్రాంతాలపై భాజపా దృష్టి సారించింది. గతంలో పలు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు సాధించిన దుబ్బాక నియోజకవర్గంతో పాటు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, భారాసల కంటే అధిక ఓట్లు సాధించిన ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని అన్ని స్థానాల్లో పోటీచేసేందుకు భాజపా సమాయత్తమవుతోంది. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించేందుకు అవసరమైన వ్యూహాలు రచిస్తున్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు నియోజకవర్గాల వారీగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

# దర్జాగా చలామణీ!



హైదరాబాద్ : పాతబస్తీలోని పచారీ దుకాణం వద్దకెళ్లిన యువకుడు రూ.200 విలువైన వస్తువులు కొనుగోలు చేశాడు. రూ.500 నోటిచ్చి మిగిలిన చిల్లర తీసుకున్నాడు. మర్నాడు ఆ నోటును పరిశీలించిన ఒకరు అది నకిలీదిగా చెప్పటంతో కంగారు పడ్డాడు. విషయం బయటపడితే కేసు తప్పదనే భయంతో దాన్ని చింపేశాడు. ఖైరతాబాద్ పరిధిలో తోపుడుబండి వద్ద పండ్లు కొని ఇదే తరహాలో నకిలీ నోటు అంటగట్టారు. ఇటీవల రాచకొండ పోలీసులు నకిలీనోట్ల తయారీ గుట్టు బట్టబయలు చేశారు. రూ.5 లక్షల నోట్ల కట్టలు, ప్రింటింగ్ మెషీన్ స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడిని అరెస్ట్‌చేశారు. అద్భుతమైన చిత్రాలకు రూపమిచ్చే కళాకారుడు ఆదాయం చాలక మిత్రులతో కలసి ఈ దందాకు సిద్ధమై పోలీసులకు పట్టుబడ్డాడు. మహానగరంలో నకిలీ నోట్లు కలకలం సృష్టిస్తున్నాయి. చిరువ్యాపారులను లక్ష్యంగా చేసుకొని మాయగాళ్లు దర్జాగా చలామణి చేస్తున్నారు. రెండేళ్ల వ్యవధిలో 9 కేసులు నమోదైతే.. ఈ ఏడాది ఇప్పటికే 3 పోలీసు కమిషనరేట్ల పరిధిలో 15కు పైగా నకిలీనోట్ల తయారీ, మార్పిడిపై కేసులు నమోదయ్యాయి. అంతర్రాష్ట్ర ముఠాలతో చేతులు కలిపిన కొందరు అడ్డదారిలో డబ్బు సంపాదించేందుకు ఈ మార్గం ఎంచుకున్నట్టు పోలీసులు భావిస్తున్నారు. కొన్ని ముఠాలు అసలు నోట్లను కలర్ జిరాక్స్ తీసి చెలామణి చేస్తున్నారు. మరికొందరు.. యూట్యూబ్‌లో వీడియోలు చూసి యంత్రం తెప్పించుకొని తయారు చేస్తున్నారు. నగరానికి చెందిన ఓ మహిళ ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు దొంగనోట్ల తయారీ వైపు మళ్లారు.

**పల్లెలు.. కాలనీలు.. నిరక్షరాస్యులు**

శివారు గ్రామీణ ప్రాంతాలు.. నగరంలోని కాలనీలు, నిరక్షరాస్యులను లక్ష్యంగా చేసుకొని ఏజెంట్లు చాకచక్యంగా నోట్ల మార్పిడి చేస్తున్నట్టు ఓ పోలీసు అధికారి తెలిపారు. చిరువ్యాపారులు, హొటళ్లు, పాన్‌దుకాణాలు, పెట్రోల్‌బంకుల్లో రూ.500 నోటిచ్చి రూ.100-200లావాదేవీలు జరుపుతారు. మిగిలినసొమ్ములో కమీషన్ తీసుకొని ముఠాలకు అప్పగిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఒకే లావాదేవీలో 4-5 నకిలీ నోట్లు గుర్తించినప్పుడే పోలీసులు కేసు నమోదు చేస్తారు. ఫిర్యాదు చేస్తే కేసుల్లో ఇరుక్కుంటామనే భయంతో చాలామంది వెనుకడుగు వేస్తున్నారు. ఇదే అదనుగా నకిలీరాయుళ్లు చెలరేగుతున్నారు.

**గుర్తించేందుకు ఇవిగో మార్గాలు**

మార్కెట్‌లో ఎక్కువగా రూ.100, 200, 500 నకిలీ నోట్లు చలామణి అవుతున్నాయి. కాస్త జాగ్రత్తగా పరిశీలిస్తే అసలు, నకిలీ తేడాను గుర్తించొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. రూ.500 నోటుపై సెక్యూరిటీ థ్రెడ్, డిజైన్, నాణ్యత చక్కగా ఉంటాయి. ఆంగ్ల పదాల్లో అక్షరాల్లో తేడా, నోటు రంగు చేతికి అంటుతున్నట్టు భావిస్తే అవి నకిలీవనే నిర్ధారించుకోవాలి. దీనిపై రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా అనే పేరులో రిజర్వ్ అనే పదంలో 'ఈ'కి బదులుగా 'ఏ' అక్షరం నకిలీ నోటుపై ఉంటుంది. అసలు నోటు స్ట్రిప్‌పై 500 సంఖ్య దేవనాగరి లిపిలో ఉంటుంది. నోటు మధ్యభాగంలో మహాత్మాగాంధీ చిత్రపటం కనిపిస్తుంది. 500సంఖ్య ఎలక్ట్రోటైప్ వాటర్‌మార్క్, నోట్ల సిరీస్ సంఖ్యలు కుడిభాగంలో ఎడమనుంచి కుడికి సైజు పెరుగుతున్నట్టు కనిపిస్తాయి.

# పెద్దాసుపత్రుల్లో సేవల సుస్తీ

కోరుట్ల : కోరుట్ల ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్, గైనకాలజిస్టు వంటి కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది కలిసి 40 పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. మెట్‌పల్లి ఆసుపత్రిలో సివిల్ సర్జన్లు మూడు, డిప్యూటీ సివిల్ సర్జన్లు నాలుగు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లు ఎనిమిది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నిత్యం 300 వరకు ఓపీ నమోదవుతుండగా 9 మంది వైద్యులు పరీక్షించి మందులు అందజేస్తున్నారు. ఎముకల వైద్య నిపుణుడు లేకపోవడంతో రోడ్డు ప్రమాద క్షతగాతులను జగిత్యాల ఆసుపత్రికి పంపిస్తున్నారు.

**పరికరాలు నిరుపయోగం**

కోరుట్లలో రూ.16.80 కోట్లతో 100 పడకల ఆసుపత్రి భవనాన్ని నిర్మించి 2023లో ప్రారంభించారు. ఆసుపత్రి నూతన భవనంలో ఒకటి, రెండో అంతస్థులో ఐసీయూ, ఆపరేషన్ థియేటర్, పిల్లల వార్డు, ఇతర వార్డులు వృథాగా ఉన్నాయి. సీఏఆర్ఎం, ఎక్స్‌రే యంత్రా



లు, ఆక్సిజన్ ప్లాంట్లు మంజూరైనా టెక్నీషియన్లు లేక నిరుపయోగంగా మారాయి. మెట్‌పల్లి సామాజిక ఆసుపత్రిలో చేపట్టిన భవన నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ప్రస్తుత భవనం సరిపోక అటు వైద్యులు, ఇటు రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

పలు చోట్ల పెచ్చులూడటమే కాకుండా వర్షానికి ఉరుస్తోంది. వైద్యులకు సరిపడా గదులు లేవు. రక్తనిల్వ కేంద్రానికి గది లేక పరికరాలు మూలన పడ్డాయి. ఎక్స్‌రే గది గోడలు తడిగా మారుతున్నాయి.

**వరండాలోనే రోగుల బారులు**

మెట్‌పల్లిలో వరండాలోనే ఓపీకి, రక్త పరీక్షలకు, మందు గోళీలకు రోగులు బారులు తీరుతున్నారు. నిత్యం 300 వరకు ఓపీ నమోదవుతుండగా జ్వరం కేసులు ఎక్కువగా రావడంతో ముప్పై పడకలకు బదులు 80 పడకలు వేసి సేవలందిస్తున్నారు. జగిత్యాల జిల్లా ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రంలో పారిశుద్ధ్యం లోపించింది. సాధారణ ఆసుపత్రిలో రోజూ 400కు పైగా ఓపీ ఉంటోంది. 60 మంది వైద్యులున్నా సిబ్బంది కొరత ఉంది. జిల్లాకేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో 300కు పైగా ఓపీ ఉండగా 50 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలో రోడ్డు గుంతలమయంగా మారడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

# ఏ భవనం చూసినా.. ఏముంది గర్వకారణం

భువనగిరి : యాదగిరిగుట్ట మండలంలోని మల్లిగూడెం గ్రామ పంచాయతీ శిథిల భవనంలో కొనసాగడం ప్రమాదాన్ని సూచిస్తోంది. గుండ్లపల్లి ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరగా ఇటీవల మరమ్మతులు చేయించినా భయాన్నే కలిగిస్తోంది. యాదగిరిగుట్ట ప్రాథమిక పాఠశాల భవనం పక్కన ఉన్న అదనపు గది పూర్తిగా శిథిలమై ఎప్పుడు కూలుతుందో తెలియడం లేదు.

జిల్లాలోని పంచాయతీ కార్యాలయాలు శిథిల భవనాల్లోనే కొనసాగుతున్నాయి. వానలకు పైకప్పుల పెచ్చులు ఊడి ప్రమాదకరంగా మారాయి. కొద్దిపాటి వర్షం వచ్చినా గోడలు, స్లాబ్ తడిసి ముద్దవుతుండటంతో దస్త్రాలు, ఇతర సామగ్రిని భద్రపరిచేందుకు సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. గ్రామ సభలు, ఇతర సమావేశాలు చెట్ల కిందే నిర్వహిస్తున్నారు.

2018లో కొత్తగా ఏర్పడిన వాటికి సొంత భవనాలు లేక ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, సామాజిక భవనాల్లో కొనసాగుతున్నాయి. పాత భవనాల్లో మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో ఒకటికి, రెంటికి కార్యదర్శులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ పరిస్థితి మరింత దారుణంగా ఉంటోందని మహిళా కార్యదర్శులు వాపోతున్నారు. పంచాయతీ భవన నిర్మాణాలకు ఎన్ఆర్ఈజీఎస్‌లో నిధులు మంజూరైనా.. పలుచోట్ల నిర్మించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు. మరికొన్ని చోట్ల శంకుస్థాపనల వరకే పరిమితమయ్యాయి.

జిల్లాలో పూర్వం 421 జీపీలు ఉండేవి. సాయినగర్ రంగారెడ్డి జిల్లాలో విలీనమైంది. 420 పంచాయతీలుండగా 30 శిథిలావస్థకు చేరుకున్నాయి. కొత్తగా ఏర్పడిన ఏడు పంచాయతీలకు సొంత భవనాలు లేవు. అవికూడా ఇతర చోట్ల కొనసాగుతున్నాయి. మిగిలినవన్నీ సొంత భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. వాటిలో కూడా కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రస్తుతం 37 జీపీల భవన నిర్మాణాలు కొనసాగు





తున్నట్లు డీఆర్‌డీవో టి.నాగిరెడ్డితో చెప్పారు.

ఆత్మకూరు మండలంలో కొరటికల్, రేపాక, పుల్లాయిగూడెం, పోతిరెడ్డిపల్లి, రాయిపల్లి, సర్వేపల్లి గ్రామ పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎన్ఆర్ఈజీఎస్ కింద కొత్త భవనాలు నిర్మించేందుకు అనుమతులు వచ్చినా నిర్మాణాలు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రావడంలేదు. సారగండ్లగూడెలో ప్రాథమిక పాఠశాల భవనంలో కొనసాగుతోంది.

జిల్లాలో గ్రామపంచాయతీలు : 427
పక్కా భవనాల్లో కొనసాగుతున్నవి: 390
శిథిల భవనాలు : 30
అద్దె, ఇతర భవనాల్లో ఉన్నవి : 37
నిర్మాణాల్లో ఉన్నవి : 37

# కమీషన్.. పరేషాన్



కరీంనగర్ : మహిళా సంఘంలోని సభ్యురాళ్లకు బ్యాంకు లింకేజీతో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు రుణాలు మంజూరు చేస్తుంటారు. ప్రతి నెలా వాయిదా ప్రకారం డబ్బులు చెల్లించిన తరువాత ఎక్కువ మొత్తంలో రుణాలు ఇస్తారు. నగదు తీసుకున్న మహిళల నుంచి ఖర్చులున్నాయంటూ క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటం చూపుతున్నారు. ఇలా మూడేళ్లలో రూ.1.5 కోటికిపైగానే అవినీతి జరిగిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్రస్తుతం జిల్లాలో ఒక్కో సంఘానికి రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణం మంజూరు చేస్తున్నారు. ఆ సమయంలో ప్రతి సభ్యురాలి నుంచి కనీసం రూ.200-700 వరకు తీసుకుంటున్నారు. బ్యాంకు లింకేజీల్లోనే కాక స్త్రీనిధిల్లోనూ చేతివాటం చూపిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో అప్పు వస్తుండటంతో సభ్యురాళ్లు సిబ్బంది సాయం చేసినట్టుగా భావించి అమాయకత్వంతో ఇస్తున్నారు. మరికొందరు ఇవ్వకపోతే ఇబ్బందులు పెడతారేమోననే భయంతో చేతిలో పెడుతున్నారు.

**మూడేళ్లలో అవినీతి రూ.1.5 కోట్లపైనే..**

గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే మహిళలు ప్రతి రోజు వ్యవసాయ పనులకు వెళ్లి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండలో పనులు చేస్తే వారికొచ్చే కూలీ రూ.400 వరకు ఉంటుంది. ఉపాధి హామీ పనులకు వెళ్లినా రూ.350లోపే వస్తుంది. ఇలాంటి వారికి రూ.వంద కూడా ఎక్కువే.

ఒకే గ్రామంలోనే ఉండే వారిపై ఫిర్యాదు చేయడానికి వెనకడుగు వేస్తున్నారు. రుణం తీసుకున్న ప్రతిసారి డబ్బులు చెల్లించక తప్పడంలేదని సభ్యురాళ్లు ఆవేదన చెందుతున్నారు.

జిల్లాలో మొత్తం 14,021 సంఘాలున్నాయి. సభ్యురాళ్లు 1,52,567 మంది ఉన్నారు. సంఘాలలో సగం సభ్యురాళ్ల నుంచి వసూలు చేసిన రూ. 200 అనుకున్న ఈ మొత్తం రూ.1.52 కోట్ల వరకు ఉంటుంది. రూ.20 లక్షల రుణం తీసుకున్న కొన్ని సంఘాల నుంచి రూ.7 వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన చూస్తే భారీ మొత్తంలోనే అవినీతి జరిగినట్లు తెలుస్తోంది.

**దృష్టికి తీసుకొస్తే తప్పకుండా చర్యలు**

– జక్కుల రవికుమార్, జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి

సంఘాల మహిళలు రుణాలు తీసుకునేందుకు అధికారులు సహకారమందిస్తారు. సభ్యురాళ్లు ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వకూడదు. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే మా దృష్టికి తీసుకు రావాలి. తప్పకుండా వారిపై చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతాం.

# పేదల జాగాపై దళారుల కన్ను



మెట్‌పల్లి : నిరుపేదల జీవనోపాధి కోసం ప్రభుత్వం పంపిణీ చేసిన అసైన్డ్ భూములు అక్రమార్కుల పరమవుతున్నాయి. సాగుకు తప్ప విక్రయించకూడదనే నిబంధనలున్నా పేదల అవసరాల ముసుగులో చేతులు మారుతున్నాయి.

**లొసుగులే ఆధారంగా..**

మెట్‌పల్లి మండలవ్యాప్తంగా సుమారు 2,840 ఎకరాల అసైన్డ్ భూములున్నాయి. మెట్లచిట్టాపూర్‌లో 497.16, ఆత్మకూర్‌లో 433.37, రంగారావుపేటలో 609.11, వెల్లుల్లలో 210.36, రామలచ్చక్కపేటలో 122.31, బండలింగాపూర్‌లో 287.37 ఎకరాలు కేటాయించినట్లు రికార్డులు చెబుతున్నాయి.

అసైన్డ్ భూములను ఇతరులకు విక్రయించడం, తాకట్టు పెట్టడంతో పాటు మరే విధంగానూ చేతులు మార్చకూడదని అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధ చట్టం 1977 పేర్కొంటోంది.

కాగా ఇందులోని లొసుగుల ఆధారంగా కొందరు అనర్హులు కూడా అసైన్డ్ భూముల కోసం యత్నించినట్లు తెలుస్తోంది.

ఆత్మకూర్ పరిధిలో 50, మెట్లచిట్టాపూర్ పరిధిలో 60, రంగారావుపేట పరిధిలో 40 ఎకరాల వరకు రీఅసైన్డ్ కోసం దరఖాస్తులు సమర్పించినా ప్రస్తుతం పెండింగ్‌లోనే ఉన్నాయి. పకడ్బందీగా విచారణ జరిపితేనే ఇందులో అర్హులెందరోతేలే అవకాశముంది.

భూదస్త్రాల ప్రక్షాళన సమయంలో నాటి ప్రభుత్వం ప్రత్యేకంగా జీవో జారీ చేసింది. నిరుపేదలకు మాత్రమే రీఅసైన్డ్ చేయాలని అందులో స్పష్టంగా పేర్కొన్నారు.

**విచారణతోనే వెలుగులోకి..**

మెట్‌పల్లి మండలంలో అసైన్డ్ భూములు కొందరు అనర్హుల ఆధీనంలో ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తుండగా, రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వ భూములు అర్హులకే చెందేలా చూడాలని భూమి లేని పేదలు కోరుతున్నారు.

**పాగా వేస్తూ..**

భూముల ధరలు పెరగడంతో కొందరు అసైన్డ్ భూములపై కన్నేసి తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అసైన్డ్ భూముల ఆధారంగా అప్పులు ఇచ్చిన వారు ప్రస్తుతం ఆ భూములు తమకే ఇవ్వాలని అంటుండటం పలు చోట్ల వివాదాస్పదమవుతోంది. అలాగే ఓ గ్రామంలోని సర్వే నంబరులో 2,141 ఎకరాల ప్రభుత్వ భూమిలో 1,865 ఎకరాలు అటవీ శాఖకు కేటాయించారు. మిగతా భూమిని అసైన్డ్ చేయగా, ప్రస్తుతం ఆన్‌లైన్లో 2,170 ఎకరాలకు చేరింది. సుమారు 30 ఎకరాలు అధికంగా నమోదు కావడం గమనార్హం. అసైన్డ్ భూముల్లో పాగా వేసి వాటిని తమ పేరిట బదలాయించుకునేందుకు కొందరు ఎత్తుగడలు వేస్తున్నారని తెలుస్తోంది.

**దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం**

–ఎన్.శ్రీనివాస్, ఆర్డీవో, మెట్‌పల్లి

ప్రభుత్వం ద్వారా పొందిన రైతులే అసైన్డ్ భూములు సాగు చేసుకోవాలి. అసైన్డ్ భూములను ఎవరైనా కొనుగోలు చేసినట్లు మా దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటాం.

# పరిశోధన విద్య.. చేరువయ్యేనా?

ఖమ్మం : ఖమ్మం ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిశోధనల నిలయంగా మారే అవకాశం కనిపిస్తోంది. విశ్వవిద్యాలయం వెలుపలా పరిశోధనలను ప్రోత్సహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల జిల్లాలోని విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. దూరప్రాంతాల్లోని విశ్వవిద్యాలయాలకు వెళ్లే బాధ తప్పుతుంది.

**కేయూ కంటే బోధన సిబ్బంది ఎక్కువే..**

కాకతీయ విశ్వవిద్యాలయంలో మొత్తం ప్రొఫెసర్లు 70 మంది ఉన్నారు. ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో రెగ్యులర్ అధ్యాపకులు 69 మంది ఉన్నారు. వీరిలో 52 మంది పీహెచ్‌డీ కలిగిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు కావటం గమనార్హం. కాంట్రాక్ట్, అతిథి అధ్యాపకులు మరో 26 మంది ఉన్నారు. ఈ లెక్కన ఒక విశ్వవిద్యాలయం కంటే స్వయం ప్రతిపత్తి కళాశాలలో ఎక్కువ మంది అధ్యాపకులు ఉండటం విశేషం. డిగ్రీలో 3,748 మంది, పీజీలో 724 మంది విద్యార్థులు చదువుతున్నారు.

**తెలుగు విభాగానికి తొలిసారి..**

2022లో పరిశోధన కేంద్రాల ఏర్పాటుకు విశ్వవిద్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఏ విభాగంలోనైనా కనీసం ఇద్దరు అర్హులైన అధ్యాపకులు ఉండాలి. పీహెచ్‌డీ పూర్తిచేసి రెండేళ్లు పూర్తవ్వాలి. యూజీసీ కోర్‌లిస్టెడ్ జర్నల్స్‌లో కనీసం ఐదు వ్యాసాలు ప్రచురితమ



వ్వాలి. ఇలా ఖమ్మం ప్రభుత్వ కళాశాలలో ఏడు విభాగాలు అర్హత కలిగి దరఖాస్తు చేశాయి. 2023లో తెలుగు విభాగానికి పరిశోధన అవకాశం దక్కింది. ప్రస్తుతం ఇద్దరు అధ్యాపకుల దగ్గర ఇద్దరు విద్యార్థులు పీహెచ్‌డీ చేస్తున్నారు.

**'కామర్స్'పై చిగురిస్తున్న ఆశలు**

ఈ సంవత్సరం కామర్స్ విభాగం పరిశోధనకు దరఖాస్తు చేశారు. కేయూ కామర్స్ ప్రొఫెసర్ల బృందం కళాశాలను మంగళవారం సందర్శించింది. కామర్స్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో పరిశోధన కేంద్రంగా గుర్తించేందుకు మౌలిక వసతులు, రీసెర్చ్ సూపర్‌వైజర్లుగా అర్హత కలిగిన అధ్యాపకులు, ఆసక్తితో దరఖాస్తు చేసుకున్నవారి బోధనానుభవం, పరిశోధన అనుభవం తదితర అంశాలను పరిశీలించింది. 55వేల పుస్తకాలు, ఈ-జర్నల్స్, ఇంటర్నెట్ సౌకర్యం కలిగిన గ్రంథాలయం, కామర్స్ లైబ్రరీతో పాటు 450 కంప్యూటర్లు ఉన్న కంప్యూటర్ ల్యాబ్‌లను గమనించింది. నివేదికను విశ్వవిద్యాలయానికి అందజేసిన తర్వాత పరిశోధన కేంద్రంపై తుది నిర్ణయం వెలువడే అవకాశముంది.

కళాశాలలో భౌతికశాస్త్రం, రాజనీతిశాస్త్రంలో పరిశోధనలకూ దరఖాస్తు చేశారు. కళాశాలలో ఇన్‌సర్వీసు అధ్యాపకులు, పీజీ పూర్తయిన విద్యార్థులు అర్హత పరీక్ష రాసి ఉత్తీర్ణులైన తర్వాత ఇక్కడ పరిశోధనలు చేసుకునే అవకాశం ఉంటుంది. కేవలం ఒకే ఒక్కసారి విశ్వవిద్యాలయానికి వెళ్లి దరఖాస్తు ఇస్తే.. పరిశోధన మొత్తం పూర్తయ్యే వరకు కళాశాలలోనే ఉండొచ్చు. తద్వారా జిల్లాలోని అనేక మంది ఉన్నత విద్యావంతులకు ప్రయోజనం కలుగుతుంది.

డా.మహ్మద్ జాకిరుల్లా, ప్రిన్సిపల్, ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల

# ఇసుకేస్తే.. రాలినన్ని కాసులు

మధిర : 'ఇసుకేస్తే రాలనంత జనం' ఇది పాత నానుడి.. ఇప్పుడు 'ఇసుకేస్తే రాలినన్ని కాసులు' అన్నది కొత్త నానుడి.. కాసుల వేటలో అక్రమార్కులు తొక్కని అడ్డదారులు లేవంటే అతిశయోక్తి కాదు. నిబంధనలను తుంగలో తొక్కి అందినకాడికి దండుకుంటూ మాఫియాగా దందా సాగిస్తున్నారు. మధిర నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక కూపన్ల జారీని అక్రమార్జనకు వినియోగించుకుంటున్నారు. జోరుగా సాగుతున్న ఈ తంతుపై నిఘా కథనం.

**ఒక్క కూపన్.. ఆరు ట్రాక్టర్లు చందంగా..**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అధికారికంగా ప్రభుత్వం కూపన్లు జారీ చేస్తోంది. మధిర మండలంలోని వైరా నదిలోని రాయపట్నం, నక్కలగరుబు రేవుల నుంచి ఇసుక తీసుకెళ్లేందుకు అనుమతులున్నాయి. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు రూ.200 చెల్లిస్తే ప్రభుత్వం ఇచ్చే కూపను ద్వారా ట్రాక్టరు ట్రక్కు ఇసుక తీసుకెళ్లవచ్చు. దీనిని అవకాశంగా మలుచుకున్న ఇసుక మాఫియా ఒక్క కూపన్‌తో కనీసం పది ట్రాక్టర్ల ఇసుకను బయటికి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

ఇటీవల రాయపట్నం రేవులో మధిర తహసీల్దార్ ఇచ్చిన కూపన్లను వినియోగించిన అనంతరం మళ్లీ తేదీలు మార్చి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న అంశం వెలుగుచూసింది. ఇసుక



అక్రమార్కులు ఈ కూపన్లు అడ్డుపెట్టుకుని ప్రైవేటు నిర్మాణదారులకు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్కో ట్రక్కు ఇసుకకు రూ. 5వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇసుక రేవుల వద్ద కొందరు మాఫియాగా ఏర్పడి.. అంతా వారిదే రాజ్యం అన్నట్టుగా దందా సాగిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇచ్చే కూపన్లు పక్కదారి పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. రేవుల వద్ద మా సిబ్బందిని నిఘా ఉంచి అక్రమ రవాణా జరగకుండా అడ్డుకుంటాం. లబ్ధిదారులకు ఇచ్చిన కూపన్ ద్వారా ఒక్క ట్రాక్టరు ట్రక్కు ఇసుకే తరలించాలి. దీన్ని అడ్డుపెట్టుకుని ప్రైవేటు వ్యక్తులు బయటికి తరలిస్తే చర్యలు తీసుకుంటాం. రాళ్లబండి రాంబాబు, తహసీల్దారు

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రైవేటు మెడికల్ దందా

హైదరాబాద్: గ్రేటర్‌లో ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ప్రైవేటు మెడికల్ దందా కొనసాగుతోంది. ఆసుపత్రుల కౌంటర్లలో సరిపడా మందులు పంపిణీ చేయక పోవడంతో చాలామంది రోగులు ప్రైవేటులో కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొందరు వైద్యులకు ఇందులో పాత్ర ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని మెడికల్ స్టోర్ల లీజు గడువు ముగుస్తున్నా ఏదో నెపంతో అక్కడే తిష్ట వేస్తున్నారు.

**దాడులు సరే..:** గతంలో గాంధీ, ఉస్మానియా, ఇతర ప్రభుత్వ ఆసుపత్రుల్లోని మెడికల్ స్టోర్లపై డ్రగ్ కంట్రోల్ అధికారులు దాడులు చేసి పలు లోపాలు గుర్తించారు. ఇప్పటివరకు చర్యల్లేవు. నిలోఫర్‌లో మెడికల్ స్టోర్ తొలగించినా రాత్రికి రాత్రే నిర్మించేందుకు ప్రయత్నించ




దంతో వెలుగులోకి తేగా ఆ అధికారిపై వేటు వేశారు.

గాంధీలో 3 ప్రైవేటు షాపులు ఎప్పటి నుంచో నడుస్తున్నాయి.

ఉస్మానియాలో 2 జనరక్, 1 సాధారణ మెడికల్ షాపు ఉంది.

గాంధీలో పడకల సామర్థ్యం 1600.. రోగులు 1800 ఉంటున్నారు.

ఉస్మానియాకు 2 వేల మంది వస్తున్నారు.

నిలోఫర్‌లో వేయికిపైగానే చికిత్సకు వస్తారు.

వైద్యులు 6 రకాలు రాస్తే 4కు మించి ఇవ్వడం లేదు. బయట కొనాల్సి రావడంతో భారం పడుతోంది.

## ఆరు వరుసలతోనే.. కులాసా

చౌటుప్పల్ : హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఏటా పది శాతం పెరుగుతోంది. 2012 డిసెంబరులో నాలుగు వరుసల రహదారి ప్రారంభమైన సమయంలో యాదాద్రి జిల్లా పంతంగి టోల్‌ప్లాజా మీదుగా రోజుకు ఇరువైపులా కలిపి 15 వేల వాహనాలు వెళ్లేవి. ఇప్పుడు ఈ సంఖ్య 40 వేలకు పెరిగింది. వారాంతపు దినాల్లో, పెళ్లిళ్లు, వేడుకల సీజన్‌లో మరో ఐదు వేల వాహనాలు అధికంగా వెళ్తాయి. గత సంక్రాంతి పండగకి రికార్డు స్థాయిలో 84,262 వాహనాలు వెళ్లాయి.

రోజూ రాకపోకలు సాగించే ప్రయాణికులతో రాజధాని శివారు ప్రాంతం చౌటుప్పల్ వరకు వాహనాల సందడి అధికంగా ఉంటుంది. ఇప్పటికే ఎల్బీనగర్ నుంచి చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం వరకు ఆరు వరుసల రహదారి నిర్మాణం పూర్తి కావడంతో వాహనదారులకు కొద్దిగా ట్రాఫిక్ బాధలు తప్పాయి. దండుమల్కాపురం నుంచీ విజయవాడ వరకు ఆరు వరుసలు నిర్మిస్తే ప్రయాణికులకు ప్రమాదాలు, ట్రాఫిక్ తిప్పలు తప్పుతాయి.

రెండు వరుసలున్న హైవేను నాలుగుగా నిర్మించేందుకు రూ.1740 కోట్లకు ఓ సంస్థ 2010లో టెండర్ దక్కించుకుంది. తెలంగాణలోని దండుమల్కాపురం నుంచి ఏపీలోని నందిగామ వరకు 181.5 కిలోమీటర్ల జాతీయ రహదారిని నాలుగు వరుసలుగా నిర్మించింది. బీవోటీ పద్ధతిన హైవే నిర్మాణాన్ని చేపట్టడంతో తెలంగాణలో పంతంగి, కొర్లపహాడ్, ఏపీలో చిల్లకల్లు వద్ద టోల్‌ప్లాజాలను ఏర్పాటు చేశారు. టోల్ వసూళ్లతోపాటు హైవే పర్యవేక్షణనూ జీఎమ్మార్ చూసేది.

ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ఆరు వరుసల విస్తరణను దండుమల్కాపురం నుంచి గొల్లపూడి వరకు 265 కిలోమీటర్ల మేర చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా వెంటనే స్పందించి సానుకూలతను తెలిపింది. నందిగామ నుంచి గొల్లపూడి వరకు ఆరు వరుసలకు ఎంత భూమిని సేకరించాలి, మొత్తం రహదారి నిర్మాణానికి ఎంత వ్యయం అవుతుందో ఐకాన్స్ సంస్థ అంచనా వేయనుంది. డీపీఆర్ ముగింపు దశకు చేరుకుందని, త్వరలో ఆరు వరుసల పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఎన్‌హెచ్‌ఏఐకి చెందిన ఉన్నతాధికారి పేర్కొన్నారు.

2024 నాటికే ఆరు వరుసలను కూడా పూర్తి చేయాలని ఆరంభంలోనే ఒప్పందం ఉంది. తెలుగు రాష్ట్రాల విభజనతో ఇసుక లారీలు, రవాణా వాహనాలు తగ్గి రోజుకు రూ.20లక్షల మేర.. నెలకు రూ.6 కోట్ల వరకు నష్టం వస్తుందని జీఎమ్మార్ సంస్థ కోర్టును ఆశ్రయించడంతో ఆరు వరుసల విస్తరణకు జాప్యం జరిగింది. 2025 జూన్ వరకు జీఎమ్మార్ సంస్థకు టోల్ వసూళ్ల అవకాశం ఉండగా.. ఎన్‌హెచ్‌ఏఐ జీఎమ్మార్ నష్టాన్ని భర్తీ చేస్తామని చెప్పి.. గతేడాది జూన్‌లోనే హైవే నిర్వహణ, టోల్ వసూళ్ల నుంచి సదరు సంస్థను పక్కకు తప్పించింది. ఆరు వరుసల నిర్మాణానికి మార్గం సుగమం కావడంతో డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్(డీపీఆర్) రూపకల్పనకు ఎన్‌హెచ్‌ఏఐ టెండరింగ్ వేసింది. ఐకాన్స్ సంస్థ టెండర్‌ను దక్కించుకొని గత నాలుగు నెలల నుంచి క్షేత్రస్థాయిలో సర్వే చేపడుతుంది. దండుమల్కాపురం నుంచి నందిగామ వరకు నాలుగు వరుసల రహదారి నిర్మాణ సమయంలోనే ఆరు వరుసలకు సరిపడా భూసేకరణ జరిగింది. అండర్‌పాస్ వంతెనలు నిర్మించిన చోట, చౌటుప్పల్, చిట్యాల పట్టణ కేంద్రాల్లో ఆరు వరుసలను అప్పట్లోనే నిర్మించారు.

## నిబంధనలకు నీళ్లు.. సెల్లార్ల చిల్లు

నల్గొండ : జిల్లాలోని ప్రధాన పురపాలికల్లో ఇష్టారాజ్యంగా సెల్లార్ల తవ్వకాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా మేడల మీద మేడలు అక్రమంగా నిర్మిస్తున్నారు. వీటి వెనుక రూ.లక్షల నిధులు చేతులు మారుతున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రధానంగా నల్గొండ, మిర్యాలగూడ, దేవరకొండ చిట్యాల, నకిరేకల్ పురపాలికల్లో వాణిజ్య భవనాలు, బహుళ అంతస్తుల నిర్మాణాల్లో ఎలాంటి అనుమతులు లేకుండానే సెల్లార్లు నిర్మిస్తున్నారు. వానాకాలంలో సెల్లార్లు తవ్వొద్దని ఆదేశాలున్నప్పటికీ బేఖాతర్ చేస్తున్నారు. పుర, పట్టణ ప్రణాళిక అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లా కేంద్రమైన నల్గొండలో ఇటీవల వాణిజ్య భవనాల నిర్మాణాలు జోరందుకున్నాయి. వాటికితోడు బహుళ అంతస్తుల భవనాల సైతం నిర్మిస్తున్నారు. కానీ అనుమతులకు విరుద్ధంగా సెల్లారు తవ్వేస్తున్నారు. ప్రధానంగా హైదరాబాద్ రోడ్డులో ఎన్జీ కళాశాల ఎదురుగా పదుల సంఖ్యలో వాణిజ్య భవనాల్లో సెల్లార్లు నిర్మిస్తున్నారు. ఎల్వీ పెట్రోల్ బంకు నుంచి మొదలు మదర్‌డెయిరీ వరకు, దేవరకొండ రోడ్డు 565 జాతీయ రహదారి పక్కన సైతం ఇష్టారాజ్యంగా నిర్మించి నిబంధనలు అతిక్రమించారు. మరోవైపు ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆక్రమంగా సెల్లార్ల నిర్మాణాలు చేపట్టినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం: ముసాబ్ అహ్మద్ సయ్యద్, కమిషనర్ నల్గొండ పురపాలిక క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలిస్తాం. అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తే నోటీసులు జారీ చేస్తాం. నిర్మాణాలు నిలిపివేస్తాం. అవసరమైతే కూల్చివేస్తాం.

## కొత్త సంఘం.. అభివృద్ధికి దోహదం



వికారాబాద్ : మహిళలను కోటీశ్వరులుగా చేయాలన్న లక్ష్యంతో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ముందుకెళ్తోంది. ఇందుకోసం కొత్త పథకాలను అమలు చేస్తోంది. ప్రస్తుతం కొనసాగుతున్నవే కాకుండా కొత్తగా 60ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, 15 నుంచి 18 ఏళ్ల కిశోర బాలికలతో సంఘాలను ఏర్పాటు చేశారు. వీరంతా రుణాలు తీసుకోని అభివృద్ధి చెందనున్నారు.

**పెట్రోలు బంకులు..**

జిల్లాలో ఇందిరా మహిళాశక్తి కార్యక్రమంలో భాగంగా నాలుగు మండలాల్లో క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. కొత్తగా వ్యాపారాలకు సహకారం అందిస్తున్నారు. దుద్యాల మండల సమాఖ్య ద్వారా పెట్రోల్ బంకును దుద్యాల మండలం హకీంపేటలో ఏర్పాటు చేయనున్నారు. సౌర ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు కోట్‌పల్లి మండలం బార్వాద్‌లో 10 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. బషీరాబాద్ మండలం దామర్‌చెడ్‌లో 5 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో ప్లాంట్ ఏర్పాటుకు రూ.3 కోట్లు ఖర్చు చేయనున్నారు.

**వేగంగా రుణాలు:** సంఘాలకు ఇవ్వాల్సిన రుణ లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేస్తున్నారు. 2025-26లో 12,615 సంఘాలకు రూ.554 కోట్ల రుణం కేటాయించాలన్నది లక్ష్యం. ఇప్పటి వరకు 2,144 సంఘాలకు రూ.205 కోట్లు మంజూరు చేశారు.

**ఆర్థిక బలోపేతమే లక్ష్యం: శ్రీనివాస్, డీఆర్డీఓ**

కొత్త సంఘాల ఏర్పాటుతో మహిళలు మరింత ఆర్థిక అభివృద్ధి చెందుతారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వివిధ కార్యక్రమాలు చేపడతాం. సోలార్ పవర్ ఉత్పత్తి కేంద్రాల పనులు కొనసాగుతున్నాయి. ఇటీవల కొత్త సంఘాలను ఏర్పాటు చేశాం. వారికి రుణ సౌకర్యం కల్పిస్తాం.

జిల్లా వివరాలు:

మండల సమాఖ్యలు: 20

గ్రామైక్య సంఘాలు: 657

వృద్ధులు : 378

కిశోర బాలికలు: 258

దివ్యాంగులు: 358

కొత్తగా ఏర్పడినవి: 172

స్వయం సహాయక సంఘాలు: 16,087

మొత్తం సభ్యులు: 1,63,955

## బాలలకు పాఠం.. విలువలకు పట్టం



కొడంగల్ : జాతీయ విద్యావిధానం -2020 అమల్లో భాగంగా విద్యాశాఖ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. ఇప్పటికే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బృంద స్ఫూర్తి, ఐకమత్య భావన పెంపొందించేందుకు పాఠశాలల్లో 'హౌజ్ సిస్టం, స్టూడెంట్ కౌన్సిల్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. తాజాగా మరో అడుగు వేసి ప్రభుత్వ పాఠశాలల్లో నైతిక విలువలను బోధించడం.. సామాజిక అవగాహన కల్పించేందుకు విలువల విద్యకు సంబంధించిన పాఠాలను ఆన్‌లైన్ విధానంలో టీ-శాట్ ద్వారా అందించనుంది. నేటి నుంచి ప్రారంభించనున్నారు. విద్యా సంవత్సరంలో 16 సెషన్స్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

**వారంలో ఒక రోజు..**

ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో నైతిక విలువలు, నిజాయతీ పెంచేందుకు ఈ విద్యా సంవత్సరంలో పలు అంశాలపై పాఠాల బోధన ఉంటుంది. వారంలో ఒక రోజు ప్రధానంగా గురువారం 45 నిమిషాల పాటు జరుగుతుంది. ప్రాథమిక తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం 1.10 నుంచి 1.50 గంటల వరకు, ఉన్నత తరగతుల వారికి మధ్యాహ్నం 2.55 నుంచి 3.35 గంటల వరకు ప్రసారాలు ఉంటాయి. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా పాఠాలను రూపొందించారు. షెడ్యూల్ వివరాలు: ఈనెల 18, అక్టోబరు 9, 16, 23, 30, నవంబరు 6, 20, 27, డిసెంబరు 4, 11, 18, 29 వరకు ప్రసారాలు నిర్వహిస్తారు.

అంశాలు: ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యార్థులకు:

సంకల్పమే విజయానికి కీలకం.

జీవిత లక్ష్యాన్ని తెలుసుకోవడం.

నిజాయతీ, కృతజ్ఞత, కలిగి ఉండడం.

ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను గౌరవించడం.

భాగస్వామ్యం-సంరక్షణ, క్రమశిక్షణ విలువ

ఓపిక, కరుణ, తోటి పిల్లలతో వ్యవహరించే విధానం.

ఉన్నత తరగతుల వారికి:

సంతోష రహస్యం, క్రమశిక్షణ.

ఆరోగ్యకరమైన అలవాట్లు, జీవన శైలి

ఒత్తిడి నిర్వహణ- సమస్య పరిష్కారం

ఆలోచన, సంఘశక్తి, బాధ్యత, జీవితం విలువైనది.

ఎంతగానో ఉపకరిస్తాయి

విద్యార్థులకు నైతిక విలువలను నేర్పడంతో జీవితంలో ఉన్నతంగా ఎదిగే అవకాశం ఉంటుంది. క్రమశిక్షణ అలవడి, ఇరుగుపొరుగు వారితో సఖ్యతతో మెలుగుతారు. ఈ పాఠ్యాంశాలు విద్యార్థులకు ఎంతగానో ఉపకరిస్తాయి. విజయరామారావు, మండల విద్యాధికారి, దుద్యాల

**జిల్లాలో బడులు ఇలా..**


ప్రాథమిక: 774

ప్రాథమికోన్నత: 116

ఉన్నత: 176

మొత్తం విద్యార్థులు: దాదాపు 77,505 మంది

## పుస్తక భాండాగారాలకు కష్టకాలం



హైదరాబాద్: విజ్ఞాన భాండాగారాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. సెస్ బకాయిలు విడుదల కాకపోవడం.. సిబ్బంది, కొత్త పుస్తకాల కొరత వల్ల ఉద్యోగార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. గ్రంథాలయాల్లో దశాబ్దాలుగా ఖాళీలను భర్తీ చేయకపోవడంతో నిర్వహణ కష్టంగా మారింది. సుమారు 30 ఏళ్లుగా రెగ్యులర్ పోస్టుల భర్తీ లేదు. తాత్కాలిక పద్ధతిలోనే నియమిస్తున్నారు. నగరంలోని గ్రంథాలయాలకు సరిపడా గ్రంథపాలకులు లేరు. ఒక్కొక్కరికి మూడు, నాలుగు చోట్ల ఇన్‌ఛార్జులుగా బాధ్యతలు అప్పగించారు. వారు ఎక్కడా సక్రమంగా విధులు నిర్వహించలేకపోతున్నారు.

**రూ.4 వేల కోట్ల బకాయిలు** కొన్నేళ్లుగా లైబ్రరీ సెస్ పెండింగ్‌లో ఉంది. రాష్ట్రంలో సెస్ ఆధారంగా నడిచే లైబ్రరీలు 600 వరకు ఉన్నాయి. వాటికి సంబంధించి రూ.4 వేల కోట్ల బకాయిలు ఉన్నాయి. నగర పరిధిలో రూ.1,600 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

**సహాయకులు లేక అధికారుల అవస్థలు**

నగరంలోని 82 గ్రంథాలయాలకు సిటీ సెంట్రల్ లైబ్రరీ కేంద్ర బిందువు. ఆయా ప్రాంతాల్లోని పుస్తకాలయాల్లో లైబ్రేరియన్లు లేకపోవడంతో స్వీపర్లతో నెట్టుకొస్తున్నారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో వయసుల వారీగా ప్రత్యేక విభాగాలు ఉన్నాయి. వాటి నిర్వహణకు సరిపడా సిబ్బంది లేరు. సహాయకులు లేక అన్ని పనులు తామే చేసుకోవాల్సి వస్తోందని అధికారులు వాపోతున్నారు. ఒక్కొక్కరు నాలుగు సెక్షన్లను పర్యవేక్షించాల్సి రావడంతో పుస్తకాల భద్రతపై నిఘా కొరవడుతోందన్నారు.

**40 మందికి నలుగురే**

చిక్కడపల్లిలోని సిటీ సెంట్రల్ లైబ్రరీకి నిత్యం వందల మంది ఉద్యోగార్థులు వస్తుంటారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణి గ్రంథపాలకులు, రికార్డు అసిస్టెంట్లు, భద్రత, ఇతర సిబ్బంది మొత్తం 40 మంది అవసరం. ప్రస్తుతం నలుగురు ఉద్యోగులే ఉన్నారు. మిగతా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఏ చిన్న ఉద్యోగ ప్రకటన వెలువడినా లైబ్రరీ నిరుద్యోగులతో కిక్కిరిసిపోతుంది.

## ఆరని దీపం.. ఆర్థిక భారం

నల్గొండ : నల్గొండ జిల్లాలోని పురపాలికల్లో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. పగలు, రాత్రి వెలుగుతుండటంతో పుర సంస్థలపై కరెంటు బిల్లుల రూపంలో ఆర్థిక భారం పడుతోంది. జిల్లా పరిధిలోని అన్ని మున్సిపాలిటీల్లో ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏజెన్సీ.. వీధి దీపాలను నిర్వహిస్తోంది. పర్యవేక్షణ, నిర్వహణకు సంబంధించిన బిల్లులు సకాలంలో సదరు సంస్థకు చెల్లించకపోవడంతో లైట్ల మరమ్మతులపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా నల్గొండ, మిర్యాలగూడల్లో వీటి నిర్వహణ కొద్దిగా బాగున్నా.. నకిరేకల్, నందికొండ, చండూరు, దేవరకొండ, హాలియా, చిట్యాలల్లో మరమ్మతులు, ఆన్‌ఆఫ్ స్విచ్‌లు, మూడో తీగ ఏర్పాటు లేకపోవటంతో పురాలపై బిల్లుల భారం పడుతోంది.

**ఎక్కడెక్కడంటే..**

నల్గొండ పట్టణమంతా వెలుగులు వెలుగుతుండగా, నకిరేకల్-నాగార్జునసాగర్ జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన లైట్లు ఎన్‌హెచ్ నిర్వహణలో ఉన్నాయి. దీంతో నల్గొండలోని దేవరకొండ రోడ్డులో కొన్ని ప్రాంతాలు చీకటిమయంగా మారాయి.

చండూరులో 20 నెలలుగా లైట్లు మరమ్మతులకు నోచుకోవడం లేదు. వీటి నిర్వహణ చూస్తున్న ఏజెన్సీకి బకాయిలు చెల్లించకపోవడంతో అలాగే గాలికొదిలేశారు.

చిట్యాల పట్టణంలో వీధి దీపాల నిర్వహణలో కీలకమైన టైమర్లు 46 వరకు పనిచేయడం లేదు. వాటిని బాగు చేయకపోవడంతో రాత్రి, పగలు వెలుగుతున్నాయి.

మిర్యాలగూడ పట్టణంలో మరమ్మతులు నిర్వహించే సిబ్బంది కొరతతో జాప్యం జరుగుతోంది. టైమర్లు సక్రమంగా లేకపోవడంతో పుర సిబ్బందే మ్యాన్‌వల్‌గా బంద్ చేస్తున్నారు.

నందికొండ, హాలియా పురపాలికల్లో లైట్ల ఆన్‌ఆఫ్ వ్యవస్థ పూర్తిగా అగమ్యగోచరంగా మారింది. ఒకరిద్దరూ సిబ్బంది ఉన్న నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో ఆయా పురపాలికలపై కరెంటు బిల్లుల భారం రూపంలో ఏటా రూ.30 లక్షలకు పైగా పడుతోంది.


**జాప్యం లేకుండా మరమ్మతులు:** ముసాబ్ అహ్మద్ సయ్యద్, కమిషనర్, నల్గొండ పురపాలిక

నల్గొండలో చెడిపోయిన లైట్లకు వెంటనే మరమ్మతులు చేయిస్తున్నాం. ఒక్కోసారి వర్షాలు, మెరుపుల వల్ల దీపాలు ఎక్కువ చెడిపోతే మరమ్మతులకు కాస్త ఆలస్యమవుతుంది. ఆన్‌ఆఫ్ స్విచ్‌లు, టైమర్లు ఏర్పాటు చేయించాం.

## పింఛను సొమ్ము.. తీసుకోవడం సులువు

సూర్యాపేట : వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు అందించే చేయూత, ఆసరా పింఛన్లను ముఖ గుర్తింపు (ఐరిస్) విధానంతో పంపిణీ చేస్తున్నారు. ఈ విధానంతో లబ్ధిదారులకు చాలా వరకు ఇబ్బందులు తప్పాయి. నెల క్రితం వరకు పింఛనుదారులకు తపాలా కార్యాలయాల ద్వారా అధికారుల వేలిముద్రల ఆధారంగా సొమ్ము అందించేవారు. ప్రస్తుతం ఐరిస్ విధానం తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో అక్రమాలకు అడ్డుకట్ట పడటంతో పాటు సేవల్లో వేగం పెరగనుంది. ముఖ గుర్తింపు రాని వారికి వేలిముద్రల ఆధారంగా, అది కూడా రాని వారికి పంచాయతీ కార్యదర్శి వేలి ముద్ర ద్వారా అందిస్తున్నారు. దీంతో కొంత వరకు ఇబ్బందులు ఎదురవుతూనే ఉన్నాయి.

**అక్రమాలకు చెక్...**



జిల్లా వ్యాప్తంగా వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తదితర 1.45 లక్షల మందికి రూ.36.50 కోట్ల పింఛను ప్రతినెలా అందిస్తున్నారు. పింఛను అందుకునే వారిలో ఎక్కువ మంది గ్రామీణ కూలీలు, వృద్ధులు ఉన్నారు. వేలి ముద్రలు పడక చాలా మంది పింఛను తీసుకునే సమయంలో ఇబ్బంది పడేవారు. ఐరిస్ విధానంతో ఈ కష్టాలు దూరం కానున్నాయి. పాత విధానంలో వేలిముద్రలు రాని లబ్ధిదారులు 5 శాతం మందికి పంచాయతీ కార్యదర్శులు తమ వేలిముద్రలు వేసి అందించేవారు. ఈ క్రమంలో లబ్ధిదారులకు పింఛను సొమ్ము పూర్తిస్థాయిలో అందేది కాదనే విమర్శలున్నాయి. కొందరు బీపీఎంలు, పంచాయతీ కార్యదర్శులు నగదును తమ సొంతానికి వాడుకున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుత విధానంలో ఐరిస్ రాకుంటే లబ్ధిదారుడి చిత్రంతో పాటు పంచాయతీ కార్యదర్శి చిత్రం నమోదు చేయనుండటంతో అక్రమాలకు చెక్ పడింది.

**సత్ఫలితాలు: అప్పారావు, డీఆర్డీవో**

పింఛన్ల జారీలో అమలులోకి వచ్చిన ఐరిస్ విధానం సత్ఫలితాలు ఇస్తోంది. తక్కువ సమయంలో ఎక్కువ మంది లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందిస్తున్నారు. పారదర్శకత పెరిగింది.

## ఇద్దరి పని ఒక్కరికి..!

సూర్యాపేట: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీల పాత్ర కీలకం. టీచర్లు, సహాయకులు ఖాళీలు ఉన్నచోట ఇద్దరి పని ఒక్కరే చేయడంతో పూర్తిస్థాయిలో సేవలు అందించడం ఇబ్బందికరంగా మారుతోంది. జిల్లాలో 5 ప్రాజెక్టులు ఉండగా.. 1209 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా, టీచర్లు కలిపి 2418 మంది సిబ్బంది పనిచేయాల్సి ఉంది. 1,131 మంది టీచర్లు, 935 మంది ఆయాలు పనిచేస్తున్నారు.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల శారీరక వికాసం, వివరాల నమోదులో జాప్యం జరుగుతోంది. ఆయాలేని కేంద్రాల్లో భోజనం తయారీ ఇబ్బందిగా ఉంటే టీచర్లు లేనిచోట పిల్లలకు అక్షరాలు దిద్దించలేని పరిస్థితి నెలకొంది. పోస్టుల భర్తీకి మూడు నెలల క్రితం ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసినా అధికారికంగా ప్రకటన నేటికీ వెలువడలేదు. ప్రకటన విడుదలైతే భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఖాళీల భర్తీకి సంబంధించిన మార్గ దర్శకాలు ఇచ్చింది. సహాయకులు, టీచర్ల పోస్టులకు ఇంటర్ పూర్తి చేసి 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు ఉన్న మహిళలు దరఖాస్తు చేసుకొనేలా నిబంధన విధించింది.

# సాగుకు ఊతం.. ఉపాధితో లాభం

చేగుంట: గ్రామాల్లో వలసలను నివారించి స్థానికంగానే ఉపాధి కల్పించాలనే ఉద్దేశంలో కేంద్ర ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. కాలానుగుణంగా నూతన పనులను చేరుస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో చెరువులు, కుంటలు, కాలువలు, మొక్కల పెంపకం, చేపల చెరువులు వంటి వాటితో పాటు రెండేళ్లుగా ఉపాధి హామీని వ్యవసాయానికి అనుసంధానం చేసేలా చర్యలు తీసుకుంటోంది. 100 శాతం రాయితీతో ఇచ్చే కింది పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుంటే ఎంతో ప్రయోజనం ఉంటుంది.

**పశువుల పాకలు:** యూనిట్ ధర రూ.98 వేలు. మూడు పశువులు కచ్చితంగా ఉన్న వారికే ప్రాధాన్యం. మేకలు లేదా గొర్రెల షెడ్లు: యూనిట్ ధర రూ.98 వేలు. 10 మేకలు లేదా గొర్రెలు ఉన్న వారే పథకానికి అర్హులు.

**పౌల్ట్రీ షెడ్లు:** ఒక యూనిట్ ధర(మండలానికి కేవలం ఐదు) రూ.25 వేలు. రైతు షెడ్డును నిర్మించుకొని 100 నాటు కోడిపిల్లలను పెంచాల్సి



ఉంటుంది. 1000 నాటు కోడిపిల్లలు పెంచేందుకు రూ.3 లక్షలు చెల్లిస్తారు.

**అజోల్లా పెంపకం:** యూనిట్ ధర రూ.20 వేలు. రైతులకు మాత్రమే అందజేస్తారు.

**వర్మీ కంపోస్టు గుంతలు:** యూనిట్ ధర రూ.15 వేలు. రైతులు సామూహికంగా లేదా వ్యక్తిగతంగా చేసుకోవచ్చు.

**ఇంకుడు గుంతలు:** ఒక్కో యూనిట్‌కు రూ.6,500 చొప్పున ఇస్తారు.

నిబంధనల ప్రకారమే పనులు...

ఎస్సీ, ఎస్టీ రైతులకు సంబంధించి సాగులో లేని భూముల్లో అభివృద్ధి పనులు, వ్యక్తిగత పనులు అందుబాటులో ఉంటాయి. లబ్ధిదారులు ఉపాధి హామీ పథకంలో నిబంధనల ప్రకారం మంజూరైన పనులు చేయాల్సి ఉంటుంది. పలు యూనిట్లకు కూలీల ఖర్చు, సామగ్రి ఖర్చులు కలిపి అందిస్తారు. మండల స్థాయిలో ఏపీవో, ఈసీ, టీఏ లేదా గ్రామస్థాయిలో క్షేత్ర సహాయకుడు లేదా పంచాయతీ కార్యదర్శులకు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి.

పంచాయతీలు: 493
ఉపాధి జాబ్ కార్డులు: 1,64,322
పనిచేస్తున్న జాబ్‌కార్డులు: 1,13,484
కూలీలు: 3,31,431
పనిచేసేవారు: 2,09,344

# పెట్టుబడి భారం.. సాగుకు దూరం

గుర్రంపోడు : రెండు దశాబ్దాల క్రితం నల్గొండ జిల్లాలో బత్తాయి సాగుకు రైతులు అత్యంత ఉత్సాహం చూపేవారు. ఎకరం భూమి ఉన్నా తగ్గకపోయేవారు. కాని నేడు పరిస్థితి విభిన్నం. బత్తాయి అంటేనే భయాందోళన చెందుతున్నారు. తెగుళ్ల బెడద, దిగుబడి తగ్గి, ఎరువులు, పురుగు మందుల ధరలు పెరిగి సాగు భారంగా మారింది. దీనికి తోడు మార్కెట్లో ధరలు కూడా తగ్గుతూ వస్తుండటం రైతులను కుంగదీస్తున్నాయి. దీంతో ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. ఇరవై ఏళ్ల కిందట ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు పైచిలుకు విస్తీర్ణంలో సాగవగా నేడు అధికారిక లెక్కల ప్రకారం 40వేల ఎకరాలకు లోపే ఉండటం ఇందుకు నిదర్శనం.

**తగ్గుతున్న దిగుబడి**

వేరుకుళ్లు వంటి తెగుళ్లు విజృంభించడంతో నియంత్రించలేని రైతులు బత్తాయి తోటలను వదిలేశారు. వేళ్లతో సహా చెట్లను తొలగించి పత్తి, ఆయిల్‌పాం సాగుకు మొగ్గుచూపుతున్నారు. ఓ వైపు నాణ్యత తగ్గిన బత్తాయికి మార్కెట్లో ధర కూడా పలకని పరిస్థితి నెలకొంది. ఈసారి మార్కెట్లో టన్ను ధర రూ.15 వేలకు పతనం అయింది. దీంతో రైతులకు కూళ్లు, రవాణా ఛార్జీలు కూడా మిగలని పరిస్థితి ఎదురైంది.

**రూ.8వేలే మిగిలాయి: యాదగిరిరెడ్డి, బత్తాయిరైతు, శాబ్దులాపురం**

ఎకరంలో సాగు చేస్తే కూలీలు రవాణా ఖర్చులు పోను రూ.8 వేలు మిగిలాయి. అందులోనే మా కుటుంబం పడిన కష్టం కూడా ఉంది. ఇక బత్తాయిని నమ్ముకుంటే బతకలేం. తీసివేద్దాం అంటే ఇంతకాలం పెంచుకున్న చెట్లను నరికివేయలేకపోతున్నాం. ప్రభుత్వం మాలాంటి చిన్న రైతులను ఆదుకోవాలి.



**మూడున్నర ఎకరాల్లో సాగుచేస్తున్నా..: దైద వేణుగోపాల్‌రెడ్డి, ఆరెగూడెం**

నాకున్న భూమిలో మూడున్నర ఎకరాల్లో సాగు చేశా. ఇప్పుడు ధర బాగా తగ్గింది. చెట్ల కిందనే పండ్లు పండి రాలిపోతున్నాయి. ఒకవేళ మరో నెలలో ధర పెరిగినా పండ్లు సగానికి పైగా రాలిపోతే నాకు మిగిలేదేముంది.

**మద్దతు ధర చెల్లించి ఆదుకోవాలి...: జొన్నలగడ్డ ఉపేందర్‌రెడ్డి, బత్తాయి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు**

ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి ఆదుకోకపోతే వచ్చే ఐదేళ్లలో ఒక్కరు కూడా బత్తాయి సాగుకు ముందుకు రారు. ఫలితంగా జిల్లాలో సాగు కనుమరుగవుతుంది. ప్రస్తుతం రైతులు ఎంతో ఇబ్బందుల్లో ఉన్నారు.

# చెరువుల్లోకి చేప పిల్లలు



ఎల్లారెడ్డిపేట :ఎట్టకేలకు ఉచిత చేప పిల్లల పంపిణీలో సందిగ్ధం తొలగింది. కొద్ది రోజులుగా ఎదురుచూస్తున్న మత్స్యకారుల నిరీక్షణకు తెరపడింది. ఈ ఏడాది చేప పిల్లలు వదిలేందుకు ప్రభుత్వం పచ్చ జెండా ఊపడంతో జిల్లా యంత్రాంగం టెండర్ల ప్రక్రియ చేపట్టింది. వచ్చే నెల టెండర్లు ఖరారు కానున్నాయి. వాస్తవంగా ఇప్పటికే టెండర్లు పూర్తి చేసి చేప పిల్లలు పంపిణీ చేయాల్సి ఉండగా పలు కారణాలతో జాప్యం నెలకొంది.

**ఇవీ సమస్యలు** ప్రతీ సీజన్‌లో పిల్లల పరిమాణం, మోతాదు విషయంలో కచ్చితమైన ప్రామాణికత పాటించడం లేదు.

పెద్దసైజు(80 నుంచి 100 ఎంఎం) పిల్లలు, చిన్న సైజు(35-40ఎంఎం) పిల్లలను చెరువుల్లో వదిలి వేయాలి.

చిన్న సైజు, కల్తీ విత్తన పిల్లల పంపిణీ చేయడంతో రవ్వ, బొచ్చ రకాల ఉత్పత్తి పెరగకపోవడంతో నష్టం వస్తుంది.

పోషకాహారలోపంతో రెండు కిలోలు ఉండాల్సిన చేప అర కిలోకే పరిమితమవుతోంది.

1.58 కోట్ల పంపిణీ లక్ష్యం

జిల్లాలో చెరువులు, కుంటలతోపాటు సుందిళ్ల బ్యారేజీ, శ్రీపాద ఎల్లంపల్లి జలాశయాల్లో చేపలు, రొయ్యల పెంపకం చేస్తున్నారు. అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి జలాశయాలు, 1,073 చెరువులు, కుంటల్లో 1.58 కోట్ల చేప పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఇందులో 35-40 ఎంఎం సైజు 1.02 కోట్లు, 80-100 ఎంఎం సైజు 56.80 లక్షలు ఉన్నాయి. గతేడాది సుల్తానాబాద్, అంతర్గాం మండలాల్లో 1.30 లక్షల పిల్లలను చెరువుల్లో వదిలేశారు. చిన్న సైజు పిల్లలు సరఫరా చేయడంతో మధ్యలో నిలిచిపోయింది. ఉచిత చేపల పిల్లల స్థానంలో నగదు బదిలీ పథకాన్ని అమలు చేయాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నప్పటికీ పిల్లల పంపిణీకే ప్రభుత్వం మొగ్గు చూపింది.

**టెండర్ల దశలో ఉంది**

ఈ ఏడాది 1.58 కోట్ల ఉచిత చేప పిల్లల పంపిణీ టెండర్ల దశలో ఉంది. వచ్చే నెల టెండర్లు తెరవనున్నాం. పెద్ద సైజులో నాణ్యమైన చేప పిల్లల పంపిణీ చేసే చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు నీటి వనరుల్లో వదలనున్నాం.నరేష్‌నాయుడు, మత్స్యశాఖ అధికారి, పెద్దపల్లి

ఉచిత చేప పిల్లల వివరాలు
సొసైటీలు : 281
సభ్యులు : 13,450
వదలనున్న వనరులు: 1,073
ఈ ఏడాది లక్ష్యం: 1.58 కోట్లు
సుందిళ్ల బ్యారేజీ: 11.41 లక్షలు
అన్నారం బ్యారేజీ: 8.79 ”
శ్రీపాద జలాశయం: 6.10 ”

# పర్యవేక్షణ లోపం.. వినియోగదారులకు శాపం



ఎల్లారెడ్డిపేట : పెట్రోలు బంకుల్లో కనీస సౌకర్యాలు మృగ్యమయ్యాయి. అస్తవ్యస్త నిర్వహణపై ఇటు అధికారులు, అటు ఆయా కంపెనీల ప్రతినిధులు ఎలాంటి చర్యలను చేపట్టడం లేదు. విజిలెన్స్, పౌరసరఫరాలశాఖ అధికారులు పెట్రోలు, డీజిల్ బంకులను క్రమం తప్పకుండా తనిఖీ చేయడం ద్వారా అక్రమాలను అరికట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

**ఇదీ పరిస్థితి** జిల్లాలో సుమారు 75 పెట్రోలు బంకులను నడుపుతున్నారు. ఉచితంగా కల్పించాల్సిన కనీస వసతులు నామమాత్రంగా అందుతున్నాయి.ఎయిర్ ఫిల్లింగ్ యంత్రాలను ఏర్పాటు చేసి, వాహనాల్లో గాలి నింపేందుకు ఓ వ్యక్తిని నియమించాలి. కానీ అనేక చోట్ల బంకుల్లో ఈ యంత్రాలు పనిచేయడం లేదు. ఎవరైనా రోడ్డు ఏదైనా ప్రమాదానికి గురైనప్పుడు అందుబాటులో ఉండే బంకుల్లో ప్రథమ చికిత్స చేసుకోవచ్చు కానీ ప్రథమ చికిత్స పెట్టెలు మచ్చుకైనా కనిపించడం లేదు. వినియోగదారులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉంచడం లేదు.కొన్ని బంకుల్లో శౌచాలయాలను నిర్మించకపోగా ఉన్నవాటిలో వినియోగించుకునేందుకు నిర్వాహకులు అభ్యంతరం తెలుపుతున్నారు.

బంకుల్లో సేవలు నచ్చకపోతే ఫిర్యాదు చేసేందుకు పెట్టెలను ఏర్పాటు చేయాల్సి ఉండాలనే నిబంధనలను గాలికొదిలేస్తున్నారు.

అగ్నిప్రమాదాలను అరికట్టేందుకు ఉన్న ఫైర్‌ఫైటింగ్ పరికరాలు పనిచేస్తున్నాయో లేదో తెలియని పరిస్థితి.

పెట్రోలు, డీజిల్ నాణ్యత, పరిమాణాలను పరీక్షించే అధికారం వినియోగదారులకు ఉంటుంది. అందుకోసం అయిదు లీటర్ల క్యాన్‌ను అందుబాటులో ఉంచాల్సి ఉన్నా పరీక్షించేందుకు ససేమిరా అంటున్నారు.

కొన్ని బంకుల్లో పైకప్పు లేకపోవడంతో ఎండ, వర్షాల నుంచి వినియోగదారులకు రక్షణ లేకుండా పోతోంది.

బంకుల యజమానులు ప్రభుత్వ నిబంధనలను పాటించాలని జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారిణి రజిత పేర్కొన్నారు. ఏవైనా ఆరోపణలుంటే వినియోగదారులు తమకు ఫోన్‌లో ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు.

ఇంధనం పోసేటప్పుడు తొలుత సున్న అంకె ఉండేలా యంత్రాన్ని సరిచేయాలి. సిబ్బంది వాహనదారుల దృష్టి మరల్చి రీడింగ్‌ను మార్చడం ద్వారా ఇంధనాన్ని తక్కువగా పోస్తుండడంతో వినియోగదారులు నష్టపోతున్నారు. నాజిల్‌ను పదేపదే నొక్కుతూ పెట్రోలు, డీజిల్ పరిమాణాన్ని తగ్గిస్తున్నట్లు జిల్లాలో పలుమార్లు వినియోగదారులు ఆందోళనకు దిగిన ఘటనలు ఉన్నాయి. మరికొన్ని బంకుల్లోని యంత్రాలను ట్యాంపర్ చేస్తున్నారనే ఆరోపణలూ లేకపోలేదు. పెట్రోలు, డీజిల్ ధరలను తెలుసుకునేందుకు పెద్దపెద్ద అక్షరాల్లో రాసి ఉన్న బోర్డులు పలుచోట్ల కనిపించడం లేదు.

కొన్ని బంకుల్లో పెట్రోలులో కలిపే ఆయిల్ ప్యాకెట్లు, ఇతర ఇంజిన్ ఆయిల్‌లను ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్ముతున్నారు.

వాహనాల్లో ఇంధనం వేసుకోగానే సంబంధిత బిల్లులను కొన్నిచోట్ల నిర్వాహకులు, సిబ్బంది ఇవ్వడం లేదు.

# దుకాణాలు ఎక్కువ.. ట్రేడ్ లైసెన్స్‌లు తక్కువ



వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలో రోజురోజుకు దుకాణాలు, వ్యాపారాల సముదాయాలు వెలుస్తున్నప్పటికీ ఆ స్థాయిలో ట్రేడ్ లైసెన్స్‌ల సంఖ్య పెరగడం లేదు. కొందరు దుకాణాల నిర్వాహకులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోకుండానే వ్యాపారాలు చేస్తున్నారు. మరికొందరు రెన్యూవల్ చేసుకోకుండానే కొనసాగిస్తున్నారు. ఏటా ఏప్రిల్ నుంచి మార్చి 31 వరకు లైసెన్స్‌లు తీసుకోవడం, రెన్యూవల్ చేసుకోవాల్సి ఉండగా చాలామంది వ్యాపారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ట్రేడ్ లైసెన్స్‌ల విధానాన్ని ఆన్‌లైన్ చేయాలని ఆదేశాలిచ్చినప్పటికీ వ్యాపారులు పట్టించుకోకపోవడంతో మున్సిపల్ అధికారులు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం లేదు.

**మున్సిపల్ ఆదాయానికి గండి**

మున్సిపల్ అధికారులు, సిబ్బంది పట్టణంలో క్షేత్ర స్థాయిలో పర్యటించి వ్యాపారులను గుర్తించి లైసెన్స్‌లు జారీ చేయాల్సి ఉంది. కానీ అధికారులు ఉదాసీనత చూపిస్తుండటంతోనే చాలావరకు ట్రేడ్ లైసెన్స్‌లు పొందడం లేదన్న విమర్శలున్నాయి.ముఖ్యంగా వ్యాపార స్థలాన్ని బట్టి ఏటా పన్ను వసూలు చేయాల్సి ఉంటుంది. ఒక్కో వ్యాపారి కనీసం ఏడాదికి రూ.వెయ్యి వరకు చెల్లించాల్సి ఉంటుంది.ప్రధానంగా ఆలయ పరిసరాల వీధులు, ప్రధాన రోడ్ల వెంబడి, పట్టణంలోని మొదటి, రెండో బైపాస్ రహదారుల వెంబడి వేలల్లో దుకాణాలున్నా చాలామంది లైసెన్స్‌లు పొందకుండానే వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.

ప్రస్తుతం వేల సంఖ్యలో దుకాణాలున్నా.. కేవలం 1978 మాత్రమే ట్రేడ్ లైసెన్స్‌లు మాత్రమే ఉన్నాయి. ఏటా వివిధ దుకాణాలు, వ్యాపార సముదాయాలు పదుల సంఖ్యలో వెలుస్తున్నప్పటికీ లైసెన్స్‌ల సంఖ్య పెరగకపోవడంతో మున్సిపల్ ఆదాయానికి గండి పడుతోంది.

బ్యాంకులు, ప్రైవేటు సంస్థల్లో రుణాలు పొంది వ్యాపారాలు నిర్వహించుకునే వారు తప్పనిసరిగా లైసెన్స్‌లు తీసుకుంటున్నా మిగతా వారు ఆసక్తి చూపడం లేదు. కొందరు పలుకుబడి ఉన్న నాయకులు, వ్యక్తుల ఒత్తిడితోనూ లైసెన్స్‌లు జారీకి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తప్పక తీసుకోవాలి

పట్టణంలో వ్యాపార వాణిజ్య సంస్థలు, దుకాణాల నిర్వాహకులు తప్పకుండా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలి. దుకాణాల నిర్వాహకుల వద్దకు మున్సిపల్ సిబ్బంది వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. సిబ్బందితో సర్వే చేయించి ఎప్పటికప్పుడు దుకాణాల నిర్వాహకులకు ట్రేడ్ లైసెన్స్‌ల జారీకి తగిన చర్యలు తీసుకుంటున్నాం. అన్వేష్, మున్సిపల్ కమిషనర్ వేములవాడ

# నీటి మీటర్లతో చుక్కలు

హైదరాబాద్ : నగరానికి తాగునీటిని సరఫరా చేసే జలమండలిలో వాటర్ మీటర్ల ప్రక్రియ ప్రహసనంగా మారింది. మీటర్లు పనిచేయకుంటే బిల్లులను రెట్టింపు, మూడు రెట్లు బాదేస్తున్నారు. 14.07 లక్షల కనెక్షన్లు ఉన్నా సగం కనెక్షన్ల మీటర్లు పని చేయడం లేదని సమాచారం. గ్రీన్‌బ్రిగేడ్ కాంట్రాక్టర్లు, విక్రయ సంస్థలు, రీడర్ల ఇష్టారాజ్యం నడుస్తోంది. బల్క్ కనెక్షన్లకు బిగించిన ఆటోమెటిక్ మీటర్లు పనిచేయక ప్రతినెలా సగటు అంచనాల మేరకు బిల్లింగ్ చేయాల్సి వస్తుంది. దీంతో జలమండలితోపాటు వినియోగదారులకూ నష్టం వాటిల్లుతోంది.

**ఫిర్యాదు చేసినా..**

మీటరు పనిచేయకపోతే మార్చుకోవడానికీ ఇక్కట్లు తప్పడం లేదు. అధికారులను సంప్రదిస్తే మీటరు మార్పు బాధ్యత మీదేనని చెబుతున్నారు. ఒక వినియోగదారుడి ఇంట్లో జనవరి నుంచి మీటరు పనిచేయడం లేదు. మార్చాలని జలమండలి కార్యాలయం చుట్టూ తిరగడమే కాకుండా ఆన్‌లైన్‌లో 30 సార్లు ఫిర్యాదు చేసినా ఇప్పటికీ స్పందన లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

**పరిష్కరించినట్లు సందేశాలు**

మీటరు పనిచేయడం లేదని ఆన్‌లైన్‌లో జలమండలికి ఉదయం ఫిర్యాదు చేస్తే సాయంత్రానికి సమస్య పరిష్కరించినట్లు వినియోగదారు చరవాణికి మెసేజ్‌లు మాత్రం వస్తున్నాయి. పరిష్కరించకుండానే ఇలా



సందేశాలు పంపడంతో వినియోగదారులు తలలు పట్టుకుంటున్నారు. తాము ఉచిత నీటి పథకం పరిధిలో ఉన్నా పనిచేయని మీటర్ల కారణంగా బిల్లులు చెల్లించాల్సి వస్తోందని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఓ కొత్త కనెక్షన్ కథ ఇది**

అమీన్‌పూర్‌లో కొత్త నల్లా కనెక్షన్‌కు మీటరు కోసం జూన్‌లో జలమండలి రూ.37 వేలు వసూలు చేసింది. కనెక్షన్ ఇచ్చేటపుడు మీటరు ఏర్పాటుకు మరో రూ.8వేలు చెల్లించాలని గ్రీన్‌బ్రిగేడ్ కాంట్రాక్టర్ వసూలు చేశారు. నెలలోపే పాడైంది. ఏడాది గ్యారంటీ ఉన్నందున మార్చాలని ఒత్తిడి చేస్తే కొత్తది ఏర్పాటు చేశారు. అదీ మొరాయించింది. చివరకు కొత్త మీటరు బిగించుకోవాల్సి వచ్చిందని వినియోగదారు వాపోయారు.


# డెంగీపై నిర్లక్ష్యం.. ప్రాణాంతకం

హైదరాబాద్ : నగరానికి చెందిన ఓ వ్యక్తి ఐదారు రోజులుగా జ్వరంతో బాధపడుతూ.. స్థానిక ఆర్‌ఎంపీకి చూపించారు. 4 రోజులకు జ్వరం తగ్గింది. పల్స్, బీపీ పడిపోవడం, కాళ్లు చేతులు చల్లబడి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. పెద్దాసుపత్రికి వెళ్లగా లక్షణాలనుబట్టి డెంగీ హెమరేజిక్ ఫీవర్‌గా గుర్తించారు. నగరానికి చెందిన ఓ బాలింతకు డెంగీ జ్వరం వచ్చింది. స్థానికంగా చికిత్స అందించారు. ఇంతలో ఆరోగ్యం దిగజారడంతో వెంటనే ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె ఆరోగ్యపరిస్థితి విషమంగా మారడంతో చికిత్స అందిస్తుండగానే ఆమె కన్నుమూశారు.

నగరంలో డెంగీ కేసులు పెరుగుతున్నాయి. గ్రేటర్‌లో ఇప్పటికే 500పైనే డెంగీ కేసులు దాటాయి. ఈ డెంగీ జ్వరంతో 90 శాతం మందికి ఎలాంటి ఇబ్బంది ఉండదు. కేవలం 10 శాతం మందిలో కొన్నిసార్లు తీవ్రంగా మారే ప్రమాదం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. డెంగీలో సిరో టైప్ 1, 2, 3, 4 రకాలు ఉంటాయి. గతంలో సిరో టైపు-1 వచ్చి తగ్గిన తర్వాత మరోసారి టైపు-2 వైరస్ సోకితే కొన్నిసార్లు అది డెంగీ హెమరేజిక్ ఫీవర్‌కు దారి తీస్తుంది. వెంటనే చికిత్స అందించాలని నిపుణులు చెబుతున్నారు.

**ప్లేట్‌లెట్స్ తగ్గడం...**


డెంగీ జ్వరంలో ప్లేట్‌లెట్స్ తగ్గడం సాధారణమే. డెంగీ హెమరేజిక్ ఫీవర్‌లో ప్లేట్‌లెట్లు 10-20 వేలకు పడిపోతాయి. శరీరంపై రాషెస్, చిగుళ్ల నుంచి రక్తం రావడం, మూత్రంలో రక్తం పోవడం, మలం



నల్లగా రావడంలాంటి లక్షణాలు కన్పిస్తే వెంటనే బాధితులను ఆస్పత్రిలో చేర్పించాలి.

**ప్లాస్మా లీకేజీ...**డెంగీలో ప్లేట్‌లెట్స్ తగ్గడంకంటే ప్లాస్మా లీకేజీ ఎక్కువ ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. రక్తంలో ఉన్న ఫ్లూయిడ్స్ బయటకు పోవడాన్ని ప్లాస్మా లీకేజీగా చెబుతారు. రక్తం చిక్కబడి రక్తప్రసరణ తగ్గి.. మెదడు, కాలేయం, కిడ్నీలులాంటి కీలక విభాగాలకు ఆక్సిజన్, పోషకాలు సరఫరా ఆగిపోయి పనిచేయడం మానేస్తాయి. గుండె వేగంగా కొట్టుకోవడం, కడుపులో తీవ్రమైన నొప్పి ఉంటుంది.

**ఈ లక్షణాలుంటే జాగ్రత్త - రాజారావు, ప్రిన్సిపల్, ఉస్మానియా మెడికల్ కళాశాల** సాధారణంగా 90 శాతం మందిలో డెంగీతో ఎలాంటి ఇబ్బంది ఉండదు. డెంగీ హేమరేజిక్ ఫీవర్‌తో మాత్రం జాగ్రత్తగా ఉండాలి. తీవ్రమైన కడుపునొప్పి, వాంతులు, శరీర భాగాల నుంచి రక్తస్రావం, పల్స్, బీపీ తగ్గడం, కాళ్లు, చేతులు చల్లబడడం, కాళ్ల వాపుతోపాటు కళ్ల కింద వాపు లాంటి లక్షణాలు కన్పిస్తే.. డెంగీ షాక్ సిండ్రోమ్‌కు దారితీస్తుంది. అపస్మారకస్థితికి చేరుకుంటారు. వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.




## పల్నాడులో రౌడీయిజం చేస్తే చూస్తూ ఊరుకోను: సీఎం చంద్రబాబు

పల్నాడు, సెప్టెంబరు 20: జగన్ ప్రభుత్వ హయాంలో మాచర్లలో ప్రజాస్వామ్యం లేదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. మాచర్లలో చాలా అరాచకాలు జరిగాయని.. అన్నీ చూశామని చెప్పుకొచ్చారు. కూటమి ప్రభుత్వంలో మాచర్లలో స్వాతంత్ర్యం వచ్చిందన్న ఆనందం ప్రజల్లో ఉందని తెలిపారు. ఇవాళ(శనివారం) మాచర్లలో సీఎం చంద్రబాబు పర్యటించారు. అనంతరం భారీ బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. గతంలో ఆత్మకూరు రాకుండా తనను అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికలకు వస్తే దాడులు చేశారని గుర్తుచేశారు. పల్నాడు వైసీపీ నేతలను ఖబడ్దార్ జాగ్రత్తగా ఉండాలంటూ చంద్రబాబు హెచ్చరించారు. రౌడీయిజం, నేరాలు, ఘోరాలు చేస్తే చూస్తూ ఊరుకోనని వార్నింగ్ ఇచ్చారు. ప్రజలపై వైసీపీ నేతలు దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రజల ఆస్తులకు రక్షణగా నిలబడదామని పిలుపునిచ్చారు. చెత్త పన్ను తొలగించడంతోపాటు చెత్త రాజకీయాలనూ క్లీన్ చేస్తామని తెలిపారు. ఎవరి ప్రవర్తన బాగాలేకపోయినా ప్రజలు క్షమించరని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. పల్నాడులో రౌడీయిజాన్ని అణచివేస్తానని చెప్పుకొచ్చారు. చెత్తనే కాదు.. చెత్త రాజకీయాలను కూడా తొలగిస్తానని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఉద్ఘాటించారు. పేదరికం లేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. దసరా కానుకగా ఆటో డ్రైవర్లకు రూ.15వేలు ఇస్తున్నామని ప్రకటించారు. కొందరు మాటలు మాత్రమే చెబుతారని.. తాము చేతల్లో చూపిస్తామని స్పష్టం చేశారు. అందరికీ ఆదాయం పెరగాలనేదే తన లక్ష్యమని ఉద్ఘాటించారు. వాట్సాప్ ద్వారానే అన్ని సేవలు అందిస్తున్నామని వెల్లడించారు. చెత్త నుంచి పెద్దఎత్తున సంపద సృష్టించే అవకాశం ఉందని.. త్వరలోనే రాజమండ్రి, నెల్లూరు, కడప, కర్నూలులో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని వివరించారు. జూన్ 26వ తేదీకి ఏపీ మొత్తం ప్లాస్టిక్ రహితంగా చేస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.





మాచర్ల: పల్నాడు జిల్లా మాచర్లలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. పారిశుద్ధ్య కార్మికులతో కలిసి చెరువు వద్ద చెత్తను ఊడ్చారు. అనంతరం కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత ప్రజావేదిక బహిరంగ సభలో సీఎం మాట్లాడారు. మార్గదర్శి- బంగారు కుటుంబాల సభ్యులతో సమావేశమయ్యారు.

## జగన్ చెప్పిన 17 మెడికల్ కాలేజీలు పచ్చి అబద్ధం: మంత్రి సంధ్యారాణి



అమరావతి: వైకాపా హయాంలో 17 మెడికల్ కాలేజీలు తెచ్చినట్లు జగన్ చెప్పిన మాటలు పచ్చి అబద్ధమని మంత్రి సంధ్యారాణి విమర్శించారు. ఆయన హయాంలో రాష్ట్ర ఖజానా నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదని చెప్పారు. రూ. 1,451 కోట్లు పూర్తిగా కేంద్ర నిధులే అని.. రాష్ట్రం వాటా సున్నా అని పేర్కొన్నారు. పులివెందుల సహా పలు కాలేజీలకు ఎన్ఎంసీ అనుమతుల రద్దుకు జగన్ వైఫల్యమే కారణమన్నారు. "తెదేపా పాలనలో మొత్తం 28 మెడికల్ కళాశాలలు స్థాపించాం. మా పార్టీ హయంలోనే నిమ్స్, స్విమ్స్, ఎయిమ్స్, జినోమ్ వ్యాలీ, మెడ్‌టెక్ సిటీ వంటి సూపర్ స్పెషాలిటీ సంస్థలు ఏర్పాటు చేశాం. ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ, ప్రతి కుటుంబానికి ఆరోగ్య బీమా సీఎం చంద్రబాబు సంకల్పం. పీపీపీ మోడల్‌లో అధునాతన వైద్య సదుపాయాలు కల్పిస్తాం" అని సంధ్యారాణి అన్నారు.

## ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం.. 9 మంది ఐఏఎస్‌ల బదిలీ




అమరావతి, సెప్టెంబరు 20 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొమ్మిది మంది ఐఏఎస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

**%బదిలీ అయిన అధికారులు వీరే..** ఏపీ జెన్కో ఎండీగా నాగలక్ష్మీ, ఆర్ అండ్ ఆర్ డైరెక్టర్‌గా ప్రశాంతి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీగా బీఆర్ అంబేద్కర్, ఎక్సైజ్ డైరెక్టర్‌గా చామకుర్తి శ్రీధర్, సీఆర్డీఏ అదనపు కమిషనర్‌గా భార్గవ్ తేజ, కృష్ణా జాయింట్ కలెక్టర్‌గా మల్లవరపు నవీన్, ఖాదీ గ్రామీణ పరిశ్రమల సీఈఓగా కట్టా సింహాచలం, నెల్లూరు జాయింట్ కలెక్టర్‌గా ముగిలి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శిగా మల్లిఖార్జున

## రాజమహేంద్రవరం - తిరుపతి మధ్య విమాన సర్వీసులు: రామ్మోహన్ నాయుడు



దిల్లీ: ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక రాజధానిగా పేర్కొనే రాజమహేంద్రవరం, ఆధ్యాత్మిక రాజధాని తిరుపతి మధ్య కొత్త విమాన సర్వీసు ప్రారంభం కానుండటంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. అక్టోబర్ 1 నుంచి ఈ మార్గంలో అలయన్స్ ఎయిర్ విమాన సర్వీసులు ప్రారంభమవుతాయని ఆయన వెల్లడించారు. అక్టోబర్ 1న ఉదయం 9.25గంటలకు తిరుపతి నుంచి రాజమహేంద్రవరం విమానం చేరుకుంటుందన్నారు. తిరుగు ప్రయాణం ఉదయం 10.15గంటలకు ఉంటుందని తెలిపారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ఈ విమాన సర్వీసులు వారంలో మూడు రోజుల పాటు సర్వీసులందిస్తాయని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ కొత్త విమాన సర్వీసు ఉదయం 07:40 గంటలకు తిరుపతి నుంచి బయల్దేరి ఉదయం 9.25గంటలకు రాజమహేంద్రవరం చేరుకొని.. తిరిగి అక్కడ ఉదయం 9.50గంటలకు బయల్దేరి 11.20గంటలకు తిరుపతి చేరుకోనుంది. ఈ కొత్త సర్వీసు ప్రాంతీయ కనెక్టివిటీని పెంచడమే కాకుండా తిరుమలలో శ్రీవారిని దర్శించుకొనే భక్తులకు ఎంతో ఉపయుక్తం కానుందన్నారు. కనెక్టెడ్ ఆంధ్రప్రదేశ్ అన్న సీఎం చంద్రబాబు ఆలోచనకు అనుగుణంగా ఈ సర్వీసును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ రూట్‌లో విమాన సర్వీసులు నడపనున్న అలయెన్స్ ఎయిర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మద్యం కేసులో రెండోరోజు ముగిసిన మిథున్‌రెడ్డి సిట్ విచారణ



విజయవాడ: మద్యం కుంభకోణం కేసులో వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి రెండో రోజు సిట్ విచారణ ముగిసింది. విజయవాడ సిట్ కార్యాలయంలో అధికారులు ఆయన్ను 4 గంటల పాటు ప్రశ్నించారు. కాసేపట్లో విజయవాడ ఏసీబీ కోర్టులో హాజరుపరిచి.. అనంతరం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించనున్నారు. ఈ కేసులో ఏ4గా మిథున్‌రెడ్డి ఉన్నారు. కుంభకోణంలో ఆయన కీలకంగా వ్యవహరించినట్లు సిట్ గుర్తించిన విషయం తెలిసిందే. తొలిరోజు శుక్రవారం సైతం మిథున్‌రెడ్డిని 4 గంటలపాటు విచారించారు. 50కి పైగా ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. ఆయన ఏ ఒక్కదానికీ సరైన సమాధానాలు చెప్పలేదని తెలిసింది. మిథున్‌రెడ్డి కుటుంబీకులకు చెందిన పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ఖాతాల్లోకి మద్యం ముడుపుల సొమ్ము రూ. 5కోట్లు జమ కావడంపై ప్రధానంగా ప్రశ్నించినట్లు సమాచారం.




అమరావతి: వైకాపా గజదొంగలు శ్రీవారి సొత్తు దోచుకున్నారు. వందకోట్ల పరకా'మనీ' దొంగ వెనుక ఆ పార్టీ నేతలు ఉన్నారని మంత్రి నారా లోకేశ్ ధ్వజమెత్తారు. ఈ మేరకు వీడియోను 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు. "జగన్ ఐదేళ్ల పాలనలో అవినీతి రాజ్యమేలింది. అరాచకం పెచ్చరిల్లింది.

దొంగలు, దోపిడీదారులు, మాఫియా డాన్లకు ఏపీని కేరాఫ్ అడ్రస్ మార్చారు. గనులు, భూములు, అడవులు, సమస్త వనరులతోపాటు జనాన్ని దోచుకున్న జగన్ గ్యాంగ్.. చివరకు తిరుమల శ్రీవారి సొత్తునూ వదల్లేదు. తాడేపల్లి ప్యాలెస్ ఆశీస్సులు, నాటి తితిదే ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అండదండలతో తిరుమల పరకామణిలో దొంగలు పడ్డారు. రూ.కోట్ల విలువైన సొత్తు కొల్లగొట్టారు. ఆ డబ్బులు రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టారు. తిరుపతిలో భూమన నుంచి తాడేపల్లి ప్యాలెస్ వరకు వాటాలు అందాయని నిందితులే చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఎంతో నమ్మకంతో కట్టిన ముడుపులు, హుండీలో వేసిన కానుకలు రూ.వందల కోట్లు రవికుమార్ దోచుకుని వెళ్లినప్పుడు తితిదే ఛైర్మన్‌గా ఉన్న భూమన కరుణాకర్ రెడ్డి.. అతడి మనుషులు ఏకంగా ఈ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేయడానికి యత్నించారు. అధికార అండతో జగన్ గ్యాంగ్ శ్రీవారికి చేయని అపచారం లేదు. భక్తులు మహా ప్రసాదంగా భావించే లడ్డూను కల్తీ చేశారు.

అన్న ప్రసాదాన్ని భ్రష్టు పట్టించారు. తిరుమల దర్శనాలను అమ్మేసి సామాన్య భక్తులకు స్వామివారి దర్శనం దుర్లభం చేశారు. ఏడుకొండల జోలికి వెళ్లొద్దు, శ్రీవారికి అపచారం తలపెట్టవద్దని.. నాడు చంద్రబాబు బతిమాలి చెప్పినా జగన్ వినలేదు. ఏడుకొండల వాడు చాలా పవర్ ఫుల్ సామీ. ఆయనకు అపచారం తలపెట్టినా, ఆయన సన్నిధిలో అవినీతికి పాల్పడినా.. ఏం జరుగుతుందో తెలిసికూడా జగన్, భూమన ఏకంగా పరకామణినే దోచేశారు. గుడిలో హుండీని దోచేసిన పాపాలతో జగన్ గ్యాంగ్ పాపం పండింది. పరకామణి వీడియోలు ఈరోజు బయటపడ్డాయి. రేపు నిందితులే వైకాపా పాపాల చిట్టా విప్పబోతున్నారు" అని లోకేశ్ పేర్కొన్నారు.




## రాయచోటిలో భారీ వర్షం.. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల ఆర్థిక సాయం

రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నలుగురు మృత్యువాత పడిన ఘటనపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పందించారు. బాధిత కుటుంబ సభ్యులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబ సభ్యులను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ ధీరజ్‌తో కలిసి మంత్రి పరామర్శించారు. శుక్రవారం రాత్రి వరదనీటిలో కొట్టుకుపోయి షేక్ ముని, ఇలియాస్, గణేష్ అనే వ్యక్తులు మృతి చెందారు. నిన్న రాత్రి గల్లంతైన బాలిక యామిని మృతదేహాన్ని ఇవాళ ఉదయం గుర్తించారు. సంఘటనా స్థలం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని మాండవ్య నదిలో ఉన్న మురుగు కాలువలో బాలిక మృతదేహం లభ్యమైంది. నాలుగు మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులను మంత్రి ఓదార్చి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం తరఫున ఒక్కో కుటుంబానికి 5 లక్షల రూపాయల ఆర్థిక సాయం చెక్కులను మంత్రి అందజేశారు. వ్యక్తిగతంగా ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున నాలుగు కుటుంబాలకు మంత్రి రూ.4 లక్షలు అందజేశారు. రాయచోటిలో గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ వర్షాలు, వరదలు రావడంతోనే ప్రమాదాలు చోటుచేసుకున్నాయని మంత్రి తెలిపారు. మురుగు కాలువల్లో కొట్టుకుపోయి నలుగురు మృతి చెందడం కలచివేసిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గత 30 ఏళ్లలో రాయచోటిలో ఇంతటి భారీ వర్షం ఎన్నడూ చూడలేదన్నారు.




టంగుటూరు: పల్లె సీమల్లో పచ్చదనం పెంచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి డీబీవీ స్వామి అన్నారు. ప్రకాశం జిల్లా టంగుటూరులో నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జగన్ చెత్త పన్ను వేసి ప్రజలను వేధిస్తే.. సీఎం చంద్రబాబు చెత్త నుంచి సంపద సృష్టిస్తున్నారని తెలిపారు. ప్రతి వ్యక్తి ఆరోగ్యం, ప్రతి కుటుంబ సాధికారత ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్లాస్టిక్ నిర్మూలన సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.




అమరావతి, సెప్టెంబర్ 20: మద్యం ముడుపుల కుంభకోణంలో చెన్నై, హైదరాబాద్‌లో సిట్ అధికారుల సోదాలు ముగిశాయి. చెన్నైలో మూడు కంపెనీల్లో ఈరోజు (శనివారం) మధ్యాహ్నం వరకూ సోదాలు జరిగాయి. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సోదరుడు వైఎస్ అనిల్ రెడ్డికి చెందిన మొత్తం 8 కంపెనీలు, ఆయన నివాసాలు రెండింటిపై సిట్ దాడులు చేసింది. ఇందులో భాగంగా కీలక డేటాను సిట్ బృందం స్వాధీనం చేసుకుంది. చెన్నైలో ఆయా కంపెనీలకు చెందిన బ్యాంక్ లావాదేవీలు చూసే అకౌంటెంట్లు, ఆడిటర్లను విచారణకు రావాల్సిందిగా నోటీసులు ఇవ్వాలని సిట్ అధికారులు భావిస్తున్నారు. హైదరాబాద్, విశాఖపట్నంలో సునీల్ రెడ్డి కంపెనీలపై నిర్వహించిన సోదాల్లో వైఎస్ అనిల్ రెడ్డి కంపెనీలకు నగదు బదిలీ అయినట్లు అధికారులు గుర్తించారు. ఈ సమాచారం ఆధారంగానే సిట్ బృందాలు చెన్నై, హైదరాబాద్‌లో అనిల్ రెడ్డి నివాసాలు, కంపెనీలపై సోదాలు చేపట్టింది. చెన్నైలోని ఆల్వార్ పేట, విజిపి లేఅవుట్‌లోని అనిల్ రెడ్డి నివాసాలపైనా దాడులు నిర్వహించాయి సిట్ బృందాలు. మద్యం ముడుపులను బ్లాక్‌ను వైట్‌గా మార్చుకునేందుకు ఈ కంపెనీల ద్వారా విదేశాల్లోని షెల్ కంపెనీలకు పంపారని సిట్ భావిస్తోంది. 2019 నుంచి 2024 వరకు ఈ కంపెనీల్లోకి వచ్చిన పెట్టుబడులు, అనిల్ రెడ్డి కొనుగోలు చేసిన ఆస్తులు, నిధులు ఎక్కడ నుంచి వచ్చాయనే అంశాలపై ఆరా తీశారు. చెన్నై, హైదరాబాద్‌లో ఉన్న ఏడు బృందాలు ఈరోజు రాత్రికి విజయవాడ చేరుకునే అవకాశం ఉంది. ఆది, సోమవారాల్లో డేటాను విశ్లేషించి తదనంతర దర్యాప్తును చేపట్టాలని సిట్ ఉన్నతాధికారులు భావిస్తున్నారు. సన్నిహితులు, సమీప బంధువులను సిట్ సరౌండ్ చేయడంతో వైసీపీ, తాడేపల్లి ప్యాలెస్‌లో ఉక్కపోత నెలకొంది.

# పాయల్.. టూ హాట్ గురూ!

పాయల్ రాజ్ పుత్.. ఈమె గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. తన అందంతో, నటనతో ప్రేక్షకులను అలరించే ఈ ముద్దుగుమ్మ.. ఎప్పటికప్పుడు తన గ్లామర్ తో అభిమానులను కట్టిపడేసే ప్రయత్నం చేస్తూ ఉంటుంది. అందులో భాగంగానే నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ప్రేక్షకులను అలరించే పాయల్ రాజ్ పుత్ మరొకసారి మరో గ్లామర్ అవుట్ ఫిట్ తో అభిమానుల ముందుకు వచ్చేసింది. తాజాగా శరీరం పై భాగం మొత్తాన్ని కవర్ చేస్తూ.. టీ షర్టు ధరించిన ఈమె.. థైస్ కనిపించేంత వరకు మాత్రమే ఆ టీ షర్టును తొడిగింది. ఇక కింద ఫాంట్ వేసుకోకపోవడంపై కొంతమంది ట్రోల్స్ చేసినా .. టూ హాట్ గురు అంటూ ఈమె అందాలపై తెగ కామెంట్లు చేస్తున్నారు ఫాలోవర్స్. తన అందంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న పాయల్ రాజ్ పుత్ ఇలా ఫ్యాంటు లేకుండా థైస్ అందాలతో అభిమానులలో మరింత హీట్ పుట్టించింది అనడంలో సందేహం లేదు. తాజాగా అభిమానులను ఆకట్టుకోవడానికి, ఫాలోవర్స్ ను పెంచుకోవడానికి ధరించిన ఈ టీ షర్టు అందాలు అభిమానులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయని చెప్పవచ్చు. పాయల్ రాజ్ పుత్ విషయానికి వస్తే..'ఆర్ఎక్స్ 100' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. మొదటి సినిమాతోనే ప్రేక్షకుల గుండెల్లో గుబులు పుట్టించిన ఈ చిన్నది.. సందర్భాన్ని బట్టి అందాలు ప్రదర్శిస్తూనే ఉంది. తెలుగు చిత్ర పరిశ్రమలో గ్లామర్



పాత్రలతో యువతరం ఆరాధ్య హీరోయిన్ గా గుర్తింపు తెచ్చుకున్న ఈ పంజాబీ ముద్దుగుమ్మ.. చివరిగా 'మంగళవారం' అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి అందర్నీ భయపెట్టేసింది. తన అందంతో అభిమానులలో గంటలు మోగించే పాయల్ రాజ్ పుత్ మంగళవారం సినిమాలో హారర్ జోనర్ లో నటించి అందరిని ఆశ్చర్యపరిచింది. పాత్ర ఏదైనా సరే పరకాయ ప్రవేశం చేస్తాను అంటూ తన పాత్రలతో అందరిని అబ్బురపరిచింది. ఇకపోతే పాయల్ రాజ్ పుత్ కి ప్రస్తుతం అనుకున్నంత స్థాయిలో పెద్దపెద్ద సినిమాలైతే రావడం లేదు. కారణం ఈమె సినిమాలపై కంటే ఇలా సోషల్ మీడియా పైన ఎక్కువగా ఫోకస్ పెట్టింది అని నెటిజన్స్ కూడా కామెంట్లు చేస్తున్నారు. నిజానికి గతంలో అభినయం ఉన్న పాత్రల కంటే గ్లామర్ రోల్స్ చేయడం వల్లే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చింది అని కూడా కామెంట్లు చేస్తూ ఉండడం గమనార్హం. మొత్తానికైతే గ్లామర్ తో ప్రేక్షకులను ఎప్పటికప్పుడు ఆకట్టుకుంటున్న ఈమెకు.. ఒక మంచి పాత్ర పడాలి అని అభిమానులు కోరుకుంటున్నారు. పాయల్ రాజపుత్ సినిమాల విషయానికి వస్తే.. 2017లో 'చెన్నా మెరేయా' అనే సినిమాతో అరంగేట్రం చేసిన ఈమె.. ఆ తర్వాత తెలుగులో ఆర్ఎక్స్ 100 సినిమాతో ప్రేక్షకులను అలరించింది. ఇక ఈ సినిమా తర్వాత జిన్నా, వెంకీ మామ, డిస్కో రాజా, కిరాతక మంగళవారం వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించింది. ఇటు తెలుగులోనే కాకుండా తమిళ్, పంజాబీ చిత్రాలలో కూడా నటించింది పాయల్ రాజ్ పుత్.

# మౌళికి మరో బంపరాఫర్

సినీ ఇండస్ట్రీలో బ్యాక్ గ్రౌండ్ అనేది ఎంట్రీ వరకే పనికొస్తుంది తప్పించి ఆ తర్వాత సొంత టాలెంట్ లేకపోతే వాళ్లని ఆడియన్స్ ఎంకరేజ్ చేయరు. టాలెంట్ ఉంటే కాస్త లేటైనా సరే స్టార్లుగా మారొచ్చని ఇప్పటికే ఎంతోమంది ప్రూవ్ చేశారు. టాలెంట్ ఎవరి సొత్తూ కాదు అని అదేదో పాటలో ఉన్నట్టు మంచి కథ, దాన్ని ఆడియన్స్ వరకు తీసుకెళ్లే టాలెంట్ ఉంటే ఎవరైనా సక్సెస్ అవొచ్చు. ఇదే విషయాన్ని చెప్తున్నారు మంచు మనోజ్. మోహన్ బాబు కొడుకుగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన మనోజ్, ఆ తర్వాత తనకంటూ సొంత గుర్తింపు తెచ్చుకున్నారు. కానీ కొంత కాలంగా మనోజ్ కెరీర్ ఫామ్ లో లేదు. రీసెంట్ గా మిరాయ్ సినిమాతో మంచి సక్సెస్ ను అందుకున్న మనోజ్, మిరాయ్ సక్సెస్‌మీట్ కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

**సక్సెస్ అవాలంటే స్టార్ల కొడుకులే కానక్కర్లేదు...** టాలీవుడ్ లో రీసెంట్ గా సక్సెస్ అయిన సినిమాల గురించి మాట్లాడుతూ లిటిల్ హార్ట్స్ సక్సెస్ గురించి ప్రస్తావించారు మనోజ్. ఇండస్ట్రీలో హీరోగా నిలదొక్కుకోవాలంటే చిరంజీవి, మోహన్ బాబు కొడుకులే కానక్కర్లేదని, మంచి టాలెంట్, కష్టపడే తపన ఉండే ఎవరైనా సక్సెస్ అవొచ్చని రీసెంట్ గా లిటిల్ హార్ట్స్ మూవీతో యుూట్యూబర్ మౌళి



నిరూపించాడని మనోజ్ ప్రశంసించారు.

**మిరాయ్ కు దక్కిన పెద్ద కాంప్లిమెంట్ అదే!...** అక్కడితో ఆగకుండా నీ సినిమాలో ఎప్పుడైనా విలన్ పాత్ర ఉంటే నేను తప్పకుండా చేస్తానని మౌళికి మీడియా ముఖంగా బంపరాఫర్ ఇచ్చారు మంచు మనోజ్. మిరాయ్ మూవీ సక్సెస్ విషయంలో ఎమోషనల్ అయిన మనోజ్, సినిమా చూశాక తన తల్లి తనను హగ్ చేసుకుని ఎమోషనల్ అవడంతో పాటూ మహావీర్ లామా క్యారెక్టర్ లో నా బిడ్డ అదరగొట్టాడని చెప్పడమే తనకు దక్కిన పెద్ద కాంప్లిమెంట్ అని చెప్పారు మనోజ్.

**రాజాసాబ్ రికార్డులు తిరగరాస్తుంది...** ఈ మధ్య ఆడియన్స్ థియేటర్లకు రావడం లేదనే అపోహ జనాల్లో బాగా ఉండిపోయిందని, కానీ మంచి కంటెంట్ తో వస్తే తెలుగు ఆడియన్స్ ఎప్పుడూ ఎంకరేజ్ చేస్తారని చెప్పిన మనోజ్, టి.జి విశ్వప్రసాద్ లాంటి మంచి నిర్మాతను తానెప్పుడూ చూడలేదని, సినిమా కోసం ఆయన ఏమైనా చేస్తారని, ప్రభాస్ హీరోగా రాబోయే రాజా సాబ్ రికార్డులు తిరగరాస్తుందని చెప్పారు. తన నెక్స్ట్ మూవీగా డేవిడ్ రెడ్డి రానుందని, ఆ తర్వాత అబ్రహం లింకన్, రక్షక్ సినిమాలు చేస్తున్నట్టు మనోజ్ వెల్లడించారు.




# డార్లింగ్ కోసం మరో సెట్.. ఈసారి ఎందుకంటే?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఓ వైపు మారుతి దర్శకత్వంలో ది రాజా సాబ్ సినిమాను పూర్తి చేస్తూనే మరోవైపు సీతారామం ఫేమ్ హను రాఘవపూడి దర్శకత్వంలో ఫౌజీ అనే సినిమా షూటింగ్ ను చేస్తున్నారు. వాటిలో ది రాజా సాబ్ షూటింగ్ ఆల్మోస్ట్ చివరి దశకు వచ్చేసింది. ది రాజా సాబ్ పై అందరికీ భారీ అంచనాలున్నాయి.

**వింటేజ్ లుక్ లో ప్రభాస్...** వాస్తవానికి రాజా సాబ్ మొదలుపెట్టినప్పుడు మారుతి దర్శకత్వంలో సినిమా చేయడం ప్రభాస్ ఫ్యాన్స్ కు కూడా నచ్చలేదు. ఈ సినిమాను ఆపేయమని, క్యాన్సిల్ చేయమని సోషల్ మీడియాలో ట్రెండ్స్ కూడా చేశారు. కానీ ప్రభాస్ కంటెంట్, మారుతిని నమ్మి రాజా సాబ్ ను ముందుకు తీసుకెళ్లారు. ప్రభాస్ నమ్మకాన్ని నిలబెడుతూ మారుతి, ప్రభాస్ ను ఈ మూవీలో వింటేజ్ లుక్ లో ప్రెజెంట్ చేసి అందరికీ షాకిచ్చారు.

**ప్రభాస్ కెరీర్లోనే మొదటిసారి..** దీంతో ఒక్కసారిగా రాజా సాబ్ పై అందరికీ ఆసక్తి ఏర్పడింది. ఆ తర్వాత రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్ కూడా బావుండటంతో సినిమాపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. దానికి తోడు ప్రభాస్ తన కెరీర్లోనే మొదటిసారి చేస్తున్న హార్రర్ కామెడీ థ్రిల్లర్ కావడం, ఈ సినిమాలో ప్రభాస్ డ్యూయల్ రోల్ లో కనిపించనుండటం.. ఒకదానికొకటి అన్నీ రాజాసాబ్ పై హైప్ ను పెంచుతున్నాయి.

**ఇండియాలోనే అతి పెద్ద సెట్..** ఈ సినిమా కోసం హవేలి పేరుతో ఓ భారీ ప్యాలెస్ ను అజీజ్ నగర్ లో సెట్ వేశారు. రాజా సాబ్ షూటింగ్ ఆల్మోస్ట్ అక్కడే ఎక్కువ జరిగింది. సుమారు 41 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో వేసిన ఈ సెట్ ఇండియాలోనే హార్రర్ సినిమా కోసం వేసిన అతి పెద్ద సెట్ గా నిలిచింది. ఈ సెట్ ను ఆర్ట్ డైరెక్టర రాజీవ్ నంబియార్ హాలీవుడ్ స్థాయిలో నిర్మించారు.

**ఖర్చు విషయంలో తగ్గేదేలే అంటున్న నిర్మాతలు...** కాగా ఇప్పటికే రాజా సాబ్ కోసం ఓ స్పెషల్ సెట్ ను వేసిన మేకర్స్ ఇప్పుడు మరో సెట్ ను వేయబోతున్నట్టు తెలుస్తోంది. ఈ సినిమాలో తమిళనాడులోని కుంభకోణంలో ఓ సాంగ్ ను ప్లాన్ చేయగా, ఇప్పుడా సాంగ్‌ను అజీజ్ నగర్ లోనే సెట్ వేసి అందులోనే చిత్రీకరించబోతున్నారని తెలుస్తోంది. బడ్జెట్ విషయంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఎక్కడా వెనక్కి తగ్గడం లేదని, ఈ సెట్ ను కూడా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన కొత్త స్టూడియోలోనే వేయనున్నారని తెలుస్తోంది.

నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాలో సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించనున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న రాజా సాబ్ వచ్చే ఏడాది జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# హిట్ కాంబో బ్యాండ్ మేళం వాయిస్తున్నారు..!




ఒక సినిమా హిట్ పడితే ఆ కాంబోకి ఎంత క్రేజ్ వస్తుందో అందరికీ తెలిసిందే. అది స్టార్స్ మాత్రమే కానక్కర్లేదు. యంగ్ పెయిర్ కి కూడా అదే రేంజ్ క్రేజ్ ఉంటుంది. రీసెంట్ గా కోర్ట్ సినిమాతో సూపర్ హిట్ జోడీగా పాపులర్ అయ్యారు. హర్ష్ రోషన్, శ్రీదేవి. నాని నిర్మాతగా రామ్ జగదీష్ డైరెక్షన్ లో తెరకెక్కిన కోర్ట్ సినిమా సూపర్ హిట్ అయ్యింది. ఈ సినిమాలో హర్ష్, శ్రీదేవి జోడీ కూడా అదిరిపోయింది. కథలెన్నో చెప్పారు కవితల్ని రాశారంటూ ఇద్దరి ప్రేమకథకు ఆడియన్స్ ఆమోదం తెలిపారు.

**బ్యాండ్ మేళం ఫస్ట్ గ్లింప్స్..** కోర్ట్ సినిమా కథ వేరు కానీ అందులో ఈ యువ జంట తమకు స్కోప్ ఉన్నంత వరకు ఇంప్రెస్ చేసింది. ఆ సినిమా ఎలాగు హిట్ అయ్యింది కాబట్టి అదే హిట్ పెయిర్ తో మరో సినిమా చేస్తున్నారు. కోనా ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్ లో మ్యాంగో మాస్ మీడియా సమర్పణలో బ్యాండ్ మేళం సినిమా వస్తుంది. ఈ సినిమాను కావ్య, శ్రీవ్య నిర్మిస్తున్నారు. సినిమాను సతీష్ జువ్వాజీ డైరెక్ట్ చేస్తున్నారు. బ్యాండ్ మేళం సినిమా ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ చేశారు మేకర్స్. కోర్ట్ సినిమాలో ఇద్దరి పాత్రలకు భిన్నంగా ఇద్దరు బ్యాండ్ మేళంలో యువ ప్రేమికులుగా కనిపిస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ గ్లింప్స్ ఇంప్రెస్ చేసింది. సినిమాకు విజయ్ బుల్గానిన్ మ్యూజిక్ అందిస్తున్నారు. కోర్ట్ సినిమాకు ఈ జంటకు ఆయనే అదిరిపోయే సాంగ్ ఇచ్చాడు. ఇప్పుడు అతనే మళ్లీ ఈ బ్యాండ్ మేళం సినిమాకు పనిచేస్తున్నారు. కోనా వెంకట్ ప్రొడక్షన్ నుంచి కొద్దిపాటి గ్యాప్ తర్వాత వస్తున్న సినిమా ఇది.

**బ్యూటిఫుల్ లవ్ స్టోరీగా..** సూపర్ హిట్ జోడీ కాబట్టి స్టోరీ, స్క్రీన్ ప్లే ఏమాత్రం ఆసక్తికరంగా ఉన్నా కూడా సినిమా సక్సెస్ అవుతుంది. ఈమధ్య యువ నటులు తమ సత్తా చాటుతున్నారు. క్యూట్ లవ్ స్టోరీస్ తో వాళ్లు చేస్తున్న హంగామా ఒక రేంజ్ లో ఉంది. కోర్ట్ తో హర్ష్ రోషన్, శ్రీదేవి జోడీ సూపర్ పాపులర్ కాగా ఆ జంట కలిసి చేస్తున్న బ్యాండ్ మేళం కూడా సంథింగ్ స్పెషల్ గా ఉండబోతుంది. బ్యాండ్ మేళం సినిమా ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీగా రాబోతుంది. రిలీజ్ చేసిన గ్లింప్స్ లో హీరో, హీరోయిన్ ఇద్దరు తెలంగాణా యాసలో మాట్లాడుతున్నారు. సో ఈ సినిమా తెలంగాణా విలేజ్ బ్యాక్ డ్రాప్ కథగా వస్తుందని చెప్పొచ్చు. ఏ సినిమాకైనా ఫస్ట్ ఇంప్రెషన్ అనేది చాలా ఇంపార్టెంట్. హర్ష్, శ్రీదేవి సూపర్ జోడీని రిపీట్ చేస్తూ బ్యాండ్ మేళం టీం రిలీజ్ చేసిన ఫస్ట్ గ్లింప్స్ యూత్ ఆడియన్స్ ని అలరిస్తుంది. కోర్ట్ సినిమా చూసిన ఆడియన్స్ అంతా ఈ జోడీ కలిసి నటించడం చూసి తెగ ఎంజాయ్ చేస్తున్నారు.

# చీరకట్టులో కవ్విస్తోన్న రెజీనా.. ఎంత అందంగా ఉందో!

రెజీనా కసాండ్రా.. 1988 డిసెంబర్ 13న తమిళనాడు చెన్నైలో జన్మించిన ఈమె.. మోడల్ గా తన కెరీర్ ను మొదలుపెట్టింది.. అలా మోడలింగ్ చేస్తున్న సమయంలోనే దర్శక నిర్మాతల కంట్లో పడ్డ ఈమె 2012లో 'శివ మనసులో శృతి' అనే సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది. మహేష్ బాబు బావ సుధీర్ బాబు హీరోగా వచ్చిన ఈ సినిమాలో తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. అంతేకాదు ఈ సినిమాలో అద్భుతమైన నటన కనబరిచినందుకుగానూ ఉత్తమ ఫిమేల్ తొలి పరిచయం విభాగంలో సైమా అవార్డును కూడా అందుకుంది. తర్వాత రొటీన్ లవ్ స్టోరీ, కొత్తజంట, పిల్ల నువ్వు లేని జీవితం, పవర్, రారా కృష్ణయ్య , సుబ్రహ్మణ్యం ఫర్ సేల్ అంటూ పలు చిత్రాలలో నటించింది. 2012లో తెలుగు తెరకు పరిచయమైనా.. 2005లోనే ఈమె సినీ రంగ ప్రవేశం జరిగిపోయింది. అలా 2005లో తమిళంలో వచ్చిన 'కందనాళ్ ముదల్' అనే సినిమా ద్వారా నటిగా ఇండస్ట్రీకి పరిచయమై.. అటు తమిళ్ ఇటు తెలుగు చిత్రాలలో నటించింది. ఇండస్ట్రీకి వచ్చి దాదాపు రెండు దశాబ్దాలకు పైగానే అవుతున్నా.. వరుస సినిమాలు చేసి ప్రేక్షకులను అలరిస్తున్న ఈమె.. ఇప్పటికీ వరుస ప్రాజెక్టులతో మరింత బిజీగా మారిపోయింది. ఒకవైపు సినిమాలు.. మరొకవైపు



వెబ్ సిరీస్ లు అంటూ ప్రేక్షకులను అలరిస్తున్న రెజీనా చివరిగా 'కేసరి చాప్టర్ 2' అనే హిందీ చిత్రంతో ప్రేక్షకులను పలకరించింది. ప్రస్తుతం 5 తమిళ్ ప్రాజెక్టులలో నటిస్తోంది ఈ ముద్దుగుమ్మ. అలా నయనతార లీడ్రోల్ పోషిస్తూ వస్తున్న 'మూకుత్తి అమ్మన్ 2' సినిమాలో నటిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. దీనిని తెలుగులో అమ్మోరు తల్లి 2 గా రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమాతో పాటు ఫ్లాష్ బ్యాక్, బోర్డర్, పార్టీ, కల్లా పార్ట్ వంటి చిత్రాలలో కూడా నటిస్తోంది. అలాగే మారీచికా అనే మలయాళం సినిమాతో పాటు సెక్షన్ 108 అనే హిందీ చిత్రంలో కూడా నటిస్తోంది. అంతేకాదు ప్రస్తుతం తెలుగులో బుల్లితెరపై ఢీ వంటి షోలలో కూడా నటిస్తూ సందడి చేస్తోంది రెజీనా కసాండ్రా. అభిమానులను అలరించడానికి ఈ మధ్య ఎక్కువగా సోషల్ మీడియాను ఫాలో అవుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే తాజాగా చీరకట్టులో కనిపించి అభిమానులను అబ్బురపరిచింది. ముత్యాలతో చాలా అందంగా డిజైన్ చేసిన చీర ధరించి తన అందంతో అభిమానులను సైతం ఆకట్టుకుంది. రెజీనా కసాండ్రా షేర్ చేసిన ఈ చీర ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో చాలా వైరల్ గా మారుతున్నాయి. అమ్మడి అందానికి అభిమానులు ఫిదా అవుతున్నారు ఇక రెజీనా వ్యక్తిగత విషయానికి వస్తే.. 37 సంవత్సరాల వయసు వచ్చిన ఇంకా వివాహం చేసుకోకపోవడంతో అభిమానులు పెళ్లెప్పుడు చేసుకుంటారు అంటూ పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు. మరి ఈ ముద్దుగుమ్మ ఎప్పుడు పెళ్లి ప్రకటన చేస్తుందో చూడాలి.

# ఓజి కంప్లీట్ యాక్షన్ మూవీ కాదు

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా టాలీవుడ్ యంగ్ టాలెంట్ సుజిత్ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్‌స్టర్ డ్రామా ఓజి. ప్రియాంక అరుళ్ మోహన్ హీరోయిన్. అనౌన్స్‌మెంట్ నుంచే ఓజి పై అందరికీ మంచి అంచనాలున్నాయి. ఇమ్రాన్ హష్మీ విలన్ గా నటిస్తున్న ఈ సినిమా సెప్టెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. రిలీజ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ ప్రమోషన్స్ ను మొదలుపెట్టింది.

**ఓజిలో యాక్షన్ ను మించి ఫ్యామిలీ డ్రామా...** ప్రమోషన్స్ లో భాగంగా మీడియా ముందుకొచ్చిన హీరోయిన్ ప్రియాంక, సినిమా గురించి, పవన్ తో స్క్రీన్ షేర్ చేసుకున్న అనుభవం గురించి పలు ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించారు. ఇదిలా ఉంటే ఓజి సినిమాను అనౌన్స్ చేసినప్పటి నుంచే ఇదొక స్టైలిష్ గ్యాంగ్‌స్టర్ డ్రామా అని ఎంతో హైప్ ఇచ్చుకుంటూ వస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఓజి సినిమా కేవలం గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా మాత్రమే కాదని, ఇందులో యాక్షన్ ను మించి ఫ్యామిలీ డ్రామా ఉంటుందని చెప్పి అందరికీ షాకిచ్చారు.



**పవన్ కళ్యాణ్ తో స్క్రీన్ షేర్ చేసుకోవడం నా అదృష్టం...** ఫ్యామిలీ డ్రామా చుట్టూ యాక్షన్ ఓ పార్ట్ లా ఉంటుంది తప్పించి, ఓజి కంప్లీట్ యాక్షన్ డ్రామా కాదని ప్రియాంక చెప్పారు. సినిమాలో ఓజాస్ లైఫ్ ను మలుపు తిప్పే కణ్మణి పాత్రలో కనిపిస్తానని చెప్పిన ప్రియాంక, ఇప్పటివరకు తాను చేసిన పాత్రల్లో ఈ క్యారెక్టర్ తనకెంతో స్పెషల్ అని, పవన్ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకునే ఛాన్స్ రావడం ప్రతీ రోజూ అదృష్టంగానే భావిస్తానని ఆమె చెప్పారు.

**ఇప్పుడు పవన్ మరింత బాధ్యతగా ఉంటున్నారు...** ఓజి కోసం రెండున్నరేళ్లుగా వర్క్ చేస్తున్నానని చెప్పిన ప్రియాంక, ఎలక్షన్స్ లో గెలవక ముందు పవన్ ఎప్పుడు చూసినా సెట్ లో కూడా ఏదోకటి ఆలోచిస్తూనే ఉండేవారని, అస్సలు ఖాళీగా ఉండేవారు కాదని, పార్టీకి సంబంధించిన ఎవరితోనైనా మాట్లాడటం, లేదంటే పుస్తకాలు చదవడం లాంటివో చేసేవారని, ఎలక్షన్స్ లో గెలిచి డిప్యూటీ సీఎం అయ్యాక ఆయన సంతోషంగా, ప్రశాంతంగా మరింత బాధ్యతగా కనిపిస్తున్నారని, గతంతో పోలిస్తే ఇప్పుడు కాస్త నవ్వుతున్నారని, అంత పెద్ద స్థాయిలో ఉన్నా ఆయనెప్పుడూ సింపుల్ గానే ఉంటారని, నిత్యం ప్రజల గురించే ఆలోచిస్తుంటారని ప్రియాంక తెలిపారు.




హైదరాబాద్: కాంగ్రెస్‌లోకి వెళ్లాలన్న ఆలోచన తనకు లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. "కాంగ్రెస్ పెద్దలు ఎవరూ నన్ను సంప్రదించలేదు. సీఎం ఎందుకలా అంటున్నారో తెలియదు.. భయపడుతున్నారేమో? కాళేశ్వరం అంశంలో తప్ప హరీశ్‌రావుపై నాకు వేరే కోపం లేదు. ఇరిగేషన్‌పై 2016లోనే కేటీఆర్‌కు సూచించాను. నేరుగా సీఎంకే ఫైళ్లు వెళ్తున్నాయని కేటీఆర్‌కు చెప్పా. కిందిస్థాయి కమిటీ పరిశీలన, ఆమోదం లేకుండానే సీఎంకు ఫైళ్లు వెళ్లాయి. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక చూస్తే అన్నీ అర్థమవుతాయి. రాజకీయ పార్టీ ఏర్పాటుపై ఇంకా ఆలోచించలేదు. రాజకీయాల్లో ఎవరూ స్పేస్ ఇవ్వరు.. తొక్కుకుంటూ వెళ్లాల్సిందే. సుప్రీంకోర్టు స్టే ఉన్నప్పటికీ ఆల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంచేందుకు కర్ణాటక సిద్ధమైంది. ఆల్మట్టిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లాలి. ప్రభుత్వం వెళ్లకుంటే జాగృతి తరఫున మేము సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం. మహారాష్ట్ర ఇప్పటికే స్పందించి కోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించింది. ఆల్మట్టి ఎత్తు పెంచితే కృష్ణా నదిలో క్రికెట్ ఆడుకోవడం తప్ప ఏమీ ఉండదు. పదేళ్లలో ఆర్డీఎస్, తుమ్మిళ్ల, పాలమూరు-రంగారెడ్డి పూర్తి చేసుకోలేకపోయాం. సీఎం రేవంత్‌రెడ్డి కూడా కృష్ణా ట్రైబ్యునల్ విచారణకు వెళ్లాలి.

భారత రాష్ట్ర సమితి పార్టీ, హరీశ్‌రావు, సంతోష్ సోషల్‌మీడియాలు నాపైనే దాడి చేస్తున్నాయి. నాపై దాడిని ప్రజలు గమనిస్తున్నారు. బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే నిరసనలు తెలుపుతాం. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశా.. ఆమోదించాలని మండలి ఛైర్మన్‌ను కోరా. ప్రజాస్వామ్యంలో ఎన్ని పార్టీలు ఉంటే అంత మంచిది. కొత్త పార్టీలు వస్తే స్వాగతిస్తాం. ఆదివారం చింతమడకలో జరిగే బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటా" అని కవిత తెలిపారు.




# పండగ వేళ టీజీఎస్ఆర్టీసీ కీలక నిర్ణయం.. మేటర్ ఏంటంటే..

హైదరాబాద్, సెప్టెంబర్ 20: బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో టీజీఎస్ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక చర్యలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 7754 స్పెషల్ బస్సులను బస్సులను నడపడానికి ప్రణాళిక సిద్ధం చేసింది. ప్రజలను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చేలా ఏర్పాట్లు చేసింది. దాదాపు 377 స్పెషల్ సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్లు కల్పించింది ఆర్టీసీ. సద్దుల బతుకమ్మ ఈనెల 30న, దసరా అక్టోబర్ 2న ఉన్నందున.. ఈ నెల 27 నుంచే సొంతూళ్లకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముండటంతో ఆ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచనుంది. అలాగే, తిరుగు ప్రయాణానికి సంబంధించి అక్టోబర్ 5, 6వ తేదీల్లోనూ రద్దీకి అనుగుణంగా బస్సులను సంస్థ ఏర్పాటు చేసింది.

**సవరణ ఛార్జీలు ఈ తేదీల్లోనే..** హైదరాబాద్‌లో ప్రధాన బస్టాండ్లైన ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్‌తో పాటు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే కేపీహెచ్‌బీ కాలనీ, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఉప్పల్ బస్టాండ్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఆరాంఘర్, తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడిపించనుంది. హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి రాష్ట్రం నలుమూలలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాలకు ఈ ప్రత్యేక బస్సులు నడుపుతోంది టీజీఎస్ ఆర్టీసీ. దసరా స్పెషల్ బస్సుల్లో మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబర్ 16 ప్రకారం తిరుగు ప్రయాణంలో ఖాళీగా వచ్చే బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చుల మేరకు టికెట్ ధరలను సంస్థ సవరించనుంది. ఈ నెల 20తో పాటు 27 నుంచి 30 వరకు, అలాగే అక్టోబర్ 1, 5, 6 వ తేదిల్లో నడిచే స్పెషల్ బస్సుల్లోనే సవరణ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఆయా రోజుల్లో తిరిగే రెగ్యూలర్ సర్వీసుల చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదని... అవి యధావిధిగా ఉంటాయని సంస్థ వెల్లడించింది.

**అదే మా లక్ష్యం: సజ్జనార్...** 'బతుకమ్మ, దసరా పండుగల దృష్ట్యా ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడానికి సంస్థ సంసిద్ధంగా ఉంది. గత దసరా కంటే ఈ సారి అదనంగా 617 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాం. రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంప్‌లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. ముఖ్యంగా ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, కేపీహెచ్‌బీ, సంతోష్ నగర్, తదితర ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం షామియానాలు, కుర్చీలు, తాగునీరు, తదితర మౌలిక సదుపాయాలతో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను ఏర్పాటు చేయాలని క్షేత్రస్థాయి అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. ప్రతి రద్దీ ప్రాంతం వద్ద పర్యవేక్షణ అధికారులను నియమిస్తున్నాం. ప్రయాణికుల రద్దీని బట్టి వారు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచుతారు. పోలీస్, రవాణా, మున్సిపల్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే లక్ష్యంగా సంస్థ అన్ని చర్యలు తీసుకుంటోంది' అని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ వెల్లడించారు.

**వెబ్‌సైట్, కాల్ సెంటర్ నెంబర్లు ఇవే..** పండుగలకు రద్దీ ఎక్కువగా ఉందని వైట్ నంబర్ ప్లేట్ గల ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి.. ఇబ్బందులు పడొద్దని ఆయన సూచించారు.

టీజీఎస్ఆర్టీసీలో ఎంతో అనుభవం గల డ్రైవర్లు ఉన్నారని, వారు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేస్తారని చెప్పారు. బతుకమ్మ, దసరా ప్రత్యేక సర్వీసుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను సంస్థ అధికారిక వెబ్ సైట్ tgsrtcbus.inలో చేసుకోవాలని కోరారు. దసరా స్పెషల్ సర్వీసులకు సంబంధించి పూర్తి సమాచారం కోసం టీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సూచించారు.

# సింగరేణి ఉద్యోగులకు దసరా ఆఫర్..

హైదరాబాద్, సెప్టెంబర్ 20: సింగరేణి ఉద్యోగులకు గుడ్ న్యూస్. దసరా పండుగ వేళ సింగరేణి సంస్థ యాజమాన్యం కీలక ప్రకటన చేసింది. ఉద్యోగులకు దసరా పండుగను పురస్కరించుకుని పండుగ అడ్వాన్స్ చెల్లించాలని నిర్ణయించింది. ఈ మేరకు సింగరేణి యాజమాన్యం శనివారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. సింగరేణిలో పని చేస్తున్న అర్హులైన రెగ్యూలర్ సిబ్బందికి రూ. 25 వేలు ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే, తాత్కాలిక కార్మికులకు రూ. 12,500 ఇవ్వనున్నట్లు యాజమాన్యం తెలిపింది. ఈ మొత్తం డబ్బులను ఈ నెల 23వ తేదీన జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

**సీఎంను కలిసిన సింగరేణి గుర్తింపు సంఘం ప్రతినిధులు..** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సింగరేణి గుర్తింపు సంఘం ప్రతినిధులు కలిశారు. కొత్తగూడెం ఎమ్మెల్యే, యూనియన్ గౌరవాధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు ఆధ్వర్యంలో సీఎంతో భేటీ అయ్యారు.




ఈ సందర్భంగా సింగరేణి అంశాలపై కీలక చర్చలు జరిపారు. సింగరేణి లాభాల వాటా 35 శాతం చెల్లించాలని సీఎంను విజ్ఞప్తి చేశారు. దీనికి సీఎం కూడా సానుకూలంగా స్పందించారు.

# బీసీల కోసం కవిత పోరాటమా?.. మధుయాష్కీ ఘాటు వ్యాఖ్యలు



హైదరాబాద్, సెప్టెంబరు 20 :తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితపై మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కవిత బీసీల కోసం కొట్లాడటం ఏంటని ప్రశ్నించారు. తీన్మార్ మల్లన్నను ప్రజలు కొంత వరకు నమ్మే అవకాశముందని... కానీ కవితను నమ్మరని చెప్పుకొచ్చారు.

మాజీ సీఎం కేసీఆర్ నాటకం నుంచి కవిత బయటకి వచ్చిందని తెలిపారు.కవిత ఇన్ని సంవత్సరాల తర్వాత ఎందుకు మాట్లాడుతోందని ప్రశ్నించారు. ఇవాళ(శనివారం) హైదరాబాద్‌లో చిట్ చాట్ చేశారు మధు యాష్కీ గౌడ్.

**కవితకు ఎవరూ మద్దతిస్తారు..** విమలక్కపై కక్షతో హైదరాబాద్‌లో ఎక్కడ ఇల్లు కిరాయికి ఇవ్వకుండా కవిత చేసిందని మండిపడ్డారు. విమలక్క పార్టీ పెడితే ప్రజలు మద్దతు ఇస్తారని... కవిత పెడితే ఎవరూ మద్దతిస్తారని ప్రశ్నల వర్షం కురిపించారు. దోచుకుంది దాచుకోవడానికే కవిత జాగృతి పెట్టిందని విమర్శించారు. గతంలో రైతు కుటుంబాలను ఆదుకుంటామని కవిత డబ్బులు వసూలు చేసిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతారనే తెలిసి బీఆర్ఎస్ నాయకులు ఇప్పటి నుంచే సాకులు వెతుకున్నారని విమర్శించారు. కవిత శవాల మీద పేలలు ఏరుకునే రకమని ఆక్షేపించారు. బీసీ అయినంత మాత్రానా బీసీ అని చూడరని చెప్పుకొచ్చారు. వేరే వర్గాల వాళ్లు బీసీల కోసం కొట్లాడుతామంటేనే ఒప్పుకోవడం లేదని పేర్కొన్నారు మధు యాష్కీ గౌడ్.

**రేవంత్‌రెడ్డి అద్భుతంగా పని చేస్తున్నారు..** 'ఐ ఆమ్ ఫుల్లీ ఫిట్. రెడీ టూ ఫైట్. కాంగ్రెస్‌లో తర్వాత వచ్చే ముఖ్యమంత్రి ఎవరనే చర్చ అవసరం లేదు. దేశంలోనే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అద్భుతంగా పని చేస్తున్నారు. వేరే రాష్ట్రాల ఎన్నికల ప్రచారానికి రమ్మని రేవంత్‌రెడ్డిను పిలుస్తున్నారు. రాష్ట్ర విభజన వల్ల మోసపోయింది వీకర్ సెక్షన్. రేవంత్‌రెడ్డి వీకర్ సెక్షన్‌కి చాంపియన్‌గా మారారు. తర్వాత ముఖ్యమంత్రి ఎవరనే చర్చ జరిగితే ప్రభుత్వంలో అస్థిరత ఉందని అనుకుంటారు. గతంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు తర్వాత ప్రధాని ఎవరని ఒక కీలక తెలుగు నేత సోనియా గాంధీని అడిగితే చెంపలు పగలకొట్టినంత పని చేశారు. రేవంత్‌రెడ్డి ఎవరి వెనక ఉండరు. ముందుండి నడుస్తారు. రేవంత్‌రెడ్డి ఫ్రంట్ ఫుట్ బ్యాటింగ్ చేస్తారు. కాళేశ్వరం బీఆర్ఎస్ పార్టీకి ఏటీఎం అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ బంధం బయట పడుతోంది. గతంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రులపై రైడ్ చేసి అరెస్ట్ చేశారు' అని మధు యాష్కీ గౌడ్ తెలిపారు.

**కేసీఆర్‌పై మోదీ ప్రభుత్వానిది మెతక వైఖరి..** 'మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై మోదీ ప్రభుత్వానిది మెతక వైఖరి. కాళేశ్వరం కేసును సీబీఐకి ఇవ్వమని బీజేపీ నేతలు పదేపదే అడిగారు. రాష్ట్ర దర్యాప్తు సంస్థలతో విచారణ చేయిస్తే రాజకీయ దురుద్దేశంతో చేస్తున్నారని అంటారు. సీబీఐ ఈ కేసులో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తోందని నమ్ముతున్నాం. మా తదుపరి పోటీ బీజేపీతోనే. బీజేపీ సీక్రెట్‌గా తెలంగాణలో పని చేస్తోంది. బీజేపీ వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో కుమ్మక్కు అయ్యి చంద్రబాబును అరెస్ట్ చేసింది. కేసీఆర్‌తో బీజేపీ కుమ్మక్కు అయింది. కేసీఆర్‌ను కాళేశ్వరం కేసు నుంచి తప్పించే అవకాశం ఉంది. రిజర్వేషన్లకు రాహుల్ గాంధీ వ్యతిరేకం కాదు. సంపద సమానంగా పంచట్లేదనే మా ఆవేదన' అని మధు యాష్కీ గౌడ్ పేర్కొన్నారు.

# ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం: భట్టి విక్రమార్క



హైదరాబాద్: రాష్ట్రంలోని మహిళలను కోటీశ్వరులను చేసే విధంగా తమ ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు.

హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జరిగిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొన్నారు. గ్రేటర్‌పరిధిలో స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేశారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఐదేళ్లలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడం తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రకటించారు. "మహిళల కోసం ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. మహిళలను ఇప్పటికే 150 ఆర్టీసీ బస్సులకు యుజమానులను చేశాం. మరో 450 బస్సులకు యజమానులను చేయబోతున్నాం. మహిళలు ఇక వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదు" అని భట్టి అన్నారు.

# మహిళలు ఆర్థికంగా బలపడేలా ప్రత్యేక పథకాలు: మంత్రి సీతక్క

హైదరాబాద్: మహిళలు మహారాణులుగా ఉండాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సీతక్క అన్నారు. హైదరాబాద్‌లోని యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జరిగిన ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. "గతంలో డబ్బుల కోసం మగవారిపై ఆధారపడే పరిస్థితి ఉండేది. మహిళలు ఆర్థికంగా బలపడేలా ప్రభుత్వం ప్రత్యేక పథకాలు తీసుకువచ్చింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. మహిళలకు కుట్టుమిషన్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు ఏర్పాటు చేశాం. గ్రామీణ ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించాం. సీఎం రేవంత్ రెడ్డి మహిళలకు పెద్దపీట వేశారు. ఉచిత బస్సు సౌకర్యం అందిస్తుంటే..



భారత రాష్ట్ర సమితి ఈ పథకాన్ని అగౌరవపరుస్తూ మహిళలపై విమర్శలు చేస్తోంది" అని మంత్రి సీతక్క అన్నారు.

# మేడ్చల్ జిల్లాలో దారుణం.. కత్తితో భార్యను నరికి భర్త పరార్





కుషాయిగూడ: మేడ్చల్ జిల్లాలోని కుషాయిగూడ పోలీసు స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకంది. భార్యను నరికి భర్త పారిపోయిన ఘటన స్థానికంగా కలకలం రేపింది.

పోలీసుల కథనం ప్రకారం.. బోడ శంకర్(40), మంజుల(35) దంపతుల స్వస్థలం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ సమీపంలోని అడ్డగూడూర్ గ్రామం. వీరికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. మృతురాలు మంజులకు 20 సంవత్సరాల క్రితం శంకర్‌తో వివాహం జరిగింది. వివాహ అనంతరం వారిద్దరు జీవనోపాధి నిమిత్తం ముంబయికి వలస వెళ్లారు. పెళ్లి తర్వాత మూడు సంవత్సరాల వరకు సంసారం సాఫీగానే సాగింది. కానీ తర్వాత నుంచి శంకర్ అనుమానంతో మంజులను తరచూ తిట్టడం, కొట్టడం చేసేవాడు. వేధింపులు భరించలేక ఆమె వారం క్రితం మహేశ్‌నగర్‌లో ఉంటున్న సోదరి రాణి ఇంటికి వచ్చింది. తర్వాత శంకర్ కూడా తన కుమారులతో కలిసి అక్కడికి వచ్చాడు. శుక్రవారం పెద్దల సమక్షంలో చర్చించిన తర్వాత శంకర్ ఇకమీదట మంజులను ఇబ్బంది పెట్టనని చెప్పి మాట ఇచ్చాడు. కానీ అర్ధరాత్రి అందరూ నిద్రపోయిన సమయంలో కత్తితో విచక్షణారహితంగా భార్యను నరికాడు.

ఆమె అరుపులకు అందరూ లేవడంతో అక్కడి నుంచి పారిపోయాడు. మంజుల అప్పటికే మృతి చెందింది. కుషాయిగూడ పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# రేవంత్‌రెడ్డికి కిషన్‌రెడ్డి ఫోబియా..: రామచందర్‌రావు



హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని నిందించడం మానుకోవాలని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌గా ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి భాజపా ఫోబియాతో పాటు కిషన్‌రెడ్డి ఫోబియా కూడా అంటుకుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఉద్యోగులకు జీతాల డబ్బులు ఇవ్వలేని రేవంత్ రెడ్డి యూనివర్సిటీకి వెయ్యి కోట్లు ఎలా ఇస్తారని నిలదీశారు. "విద్యా వ్యవస్థ పూర్తిగా దుర్భర పరిస్థితుల్లోకి వెళ్లింది. రేవంత్ రెడ్డికి దిల్లీకి వెళ్లడమే సరిపోతోంది. శ్యామ్ పిట్రోడా ట్రైనింగ్ ఇవ్వడం వల్లే రాహుల్ గాంధీ అలా తయారయ్యారు. ఓట్ల చోరీ అనే కొత్త నాటకాన్ని తెరమీదకు తెచ్చి దేశ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. బోగస్ ఓట్లు వేరు.. ఓట్ల చోరీ వేరు. ఈ చిన్న విషయం కూడా తెలియని రాహుల్ గాంధీ ఓట్ల చోరీ అంటారు.. హైడ్రోజన్ బాంబ్ అంటారు.. ఇంకేదో అంటున్నారు. ఎన్డీఎస్‌ఏ ఇచ్చిన రిపోర్ట్ ప్రకారమే కాళేశ్వరంపై పీసీ ఘోష్ విచారణ చేపట్టింది. కమిషన్ విచారణలో నిందితులు ఎవరన్నది తేల్చిందా? రాజకీయ నేతలను ఎవరినైనా అరెస్ట్ చేశారా?" అని రామచందర్‌రావు ప్రశ్నించారు.



# కొత్త మద్యం బ్రాండ్లు సిద్దం - అమ్మకాలు, ధరలపై కొత్త ఫార్ములా..!!

మందుబాబులకు గుడ్ న్యూస్. కొత్త మద్యం బ్రాండ్లు అందుబాటులోకి వస్తున్నాయి. రాష్ట్రంలో కొత్తగా 603 మద్యం బ్రాండ్లు ఎంట్రీ ఇచ్చేందుకు సిద్దంగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి అధికారిక అనుమతి కోసం కంపెనీలు వేచి చూస్తున్నాయి. ఇందులో ఇప్పటి వరకు రాష్ట్రంలో వినియోగం లో లేని జాతీయ - అంతర్జాతీయ బ్రాండ్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ బ్రాండ్ల ఎంట్రీ వేళ ఫీజులు.. అమ్మకాల పైన కొత్త ఫార్ములా అమలుకు వీలుగా ప్రతిపాదనలు సిద్దమైనట్లు సమాచారం. తెలంగాణలో ప్రవేశించేందుకు కొత్తగా 603 మద్యం బ్రాండ్లు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి అనుమతి కోసం వేచి చూస్తున్నాయి. కాగా, ఇప్పటికే రాష్ట్రంలో 1956 మద్యం బ్రాండ్‌లు చలామణిలో ఉన్నాయి. కొత్తగా వేచి చూస్తున్న వాటిల్లో 603 జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్‌లు ఉన్నట్లు సమాచారం. వీటి అనుమతి కోసం సుమారు 97 కంపెనీలు ఇటు రాష్ట్ర ఎక్సైజ్.. ప్రభుత్వం చుట్టూ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల ఎక్సైజ్‌శాఖ అధికారులకు భారీగా నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్డీపీఎల్) పట్టుబడింది. ఆ మద్యం సీసాల్లో లోకల్ బ్రాండ్‌లు లేని విషయాన్ని అధికారులు గుర్తు చేస్తున్నారు. ఈ ఎన్డీపీఎల్‌లో అత్యధికశాతం మన దగ్గర అందుబాటులో లేని జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్‌లే ఉంటున్నాయని ఎక్సైజ్ అధికారులు చెప్తున్నారు. దీంతో, కొత్త బ్రాండ్లకు ప్రభుత్వం నుంచి అనుమతి లభిస్తే ఈ ఎన్డీపీఎల్ బాధ తగ్గుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. అదే విధంగా కొత్తవాటికి అనుమతిస్తే.. ఒక్కో బ్రాండ్‌కు రూ.15 వేల చొప్పున అనుమతి ఫీజును వసూలు చేసే అవకాశం ఉంది. దీని ద్వారా ప్రభుత్వ ఖజానాకు రూ.90,45,000లు రాబడి వస్తుంది. ప్రస్తుతం తెలంగాణలో 13 బీర్ కంపెనీలు, 51 జాతీయ లిక్కర్ కంపెనీలు, 27 విదేశీ లిక్కర్ కంపెనీల నుంచి 86 రకాల బీర్ బ్రాండ్‌లు, 770 రకాల ఇండియన్ లిక్కర్ బ్రాండ్‌లు, 1091 విదేశీ లిక్కర్ బ్రాండ్‌లు అందుబాటులో ఉన్నాయి. తెలంగాణలో కొత్తగా బీర్లు, మద్యం సరఫరా చేయాలనుకునే కంపెనీల కోసం ప్రభుత్వం కొన్ని నిబంధనలు తీసుకొచ్చింది. వాటిల్లో కొన్ని కంపెనీలు ఇప్పటికే 603 రకాల బ్రాండ్‌లను ప్రవేశపెట్టేందుకు అనుమతుల కోసం తిరుగుతున్నాయి. ప్రభుత్వం మద్యం వ్యవహారంలో ఆచి తూచి వ్యవహరిస్తోంది. దీంతో.. ఇప్పుడు ప్రభుత్వం ఈ బ్రాండ్లకు అనుమతి ఎప్పుడు ఇస్తారనేది స్పష్టత రావాల్సి ఉంది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com